# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

బుధవారం 20 సెప్టెంబర్ 2023


## జగన్ కాలనీలో తొలగించిన వాటర్‌ట్యాంకు

### వార్తకు స్పందన



**మదనపల్లె, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త :**

పట్టణ సమీపంలోని అనపగుట్ట గోవర్ధనగిరి కొండ కింద కొత్తగా లబ్దిదారులకు జగన్‌కాలనీలో ఎట్టకేలకు వాటర్ ట్యాంకు మున్సిపల్ అధికారులు తొలగించారు. ఈ కాలనీలో రోడ్డు మద్యలో అధికారులు వాటర్ ట్యాంకు ఏర్పాటు చేశారన్న శీర్షిక వార్తలో ప్రముఖంగా ప్రచురించిన విషయం తెలిసిందే. స్పందించిన మున్సిపల్ అధికారులు మంగళవారం రోడ్డుకు అడ్డంగా ఉన్న వాటర్ ట్యాంకును ఎట్టకేలకు తొలగించారు. దీంతో జగన్ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. సుమారు 30కుటుంబాలకు పైగా నివాసాలు ఉన్న ఈ కాలనీలో గతంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న వాటర్ ట్యాంకుతో పలువురు ఇబ్బందులు పడేవారు. తొలగించడం పట్ల అధికారులను అభినందిస్తున్నారు. అదే విధంగా జగన్‌కాలనీలో సిసిరోడ్లు, మురుగునీటి కాలువలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

## చేనేత కార్మికుడు ఆత్మహత్య

**మదనపల్లెక్రైం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త :**



కురబలకోట మండలంలో చేనేత కార్మికుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న విషాదకర సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా వున్నాయి. తంబళ్లపల్లెకు చెందిన షేక్ ఖాసింసాబ్ కుమారుడు ఎస్.బాబ్‌జాన్(40) మదన పల్లెలోని నీరుగట్టువారిపల్లెలో నివాసం ఉంటూ చేనేత కార్మికు నిగా పనిచేస్తున్నాడు. ఇతను భార్యతో గొడవపడడంతో ఇద్దరూ విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన దాదంవారిపల్లెకి సమీపాన తూపల్లి గుట్ట వద్ద ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పేదల జీవితాలలో ఆనందం చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

### – నూతన పెన్షన్ల పంపిణీలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



**లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**

పేదల జీవితాలలో ఆనందం, సంతోషం చూడాలన్నదే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని వైఎస్ఆర్ సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లెలోని ఎంపీ డీవో కార్యాలయంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన నూతన పెన్షన్ల పంపిణీలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గడప గడపలో తిరఉగుతున్నప్పుడు గ్రామాల్లో వృద్దులతో మమేకమైనప్పుడు వారి చెబుతున్న మాటలు హృదయాన్ని హత్తుకుంటున్నాయని వృద్దులు, వికలాంగులను మానవత్వంతో ప్రతి ఒక్కరూ చేయూత అందించాలన్నారు. ప్రభుత్వంలో పెన్షన్ల కోసం నెలకు రూ.1900 కోట్లు ఇస్తోందన్నారు. వివిధ సంక్షేమ పథకాల కోసం రూ.2లక్షల కోట్లు నిధులను ప్రజల ఖాతాల్లో జమ చేసిందని తెలిపారు. ఇంత అభివృద్ధి చేసినందుకా జగన్‌ను విమర్శిస్తున్నారని శ్రీకాంత్‌రెడ్డి ప్రతిపక్షాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి మట్లాడుతూ వైఎస్ఆర్‌కు తగ్గ తనయుడు సీఎం జగన్ అని కొనియాడారు. కుల, మత, వర్గ బేధం లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు ఇవ్వడం జరుగుతోందన్నారు. మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్య మాట్లాడుతూ ప్రతి ఇంటికి మేలు ఏయాలన్న సంకకల్పంతో సీఎం జగన్ ముందుకెళ్తున్నారన్నారు. వికలాంగులు, వితంతులకు ఎమ్మెల్యే, ఎంపీపీ, మాజీ ఎంపీపీల చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డి పల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, మార్కెట్ కమిటటీ ఛైర్మన్ విశ్వనాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్య, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, ఉప మండలా ధ్యక్షుడు నరసింహారెడ్డి, సుబ్బరాయుడు, సర్పంచులు వెంకట నారాయణరెడ్డి, రమణయ్య, సిద్దక నాగిరెడ్డి, నాగేంద్రబాబు, విజయ్, వైసీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



### నాలుగేళ్లలో పెన్షన్ల పంపిణీకి రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు పెట్టిన ఘనత సీఎం జగన్‌దే

**గాలివీడు, సెప్టెంబర్ 19(ప్రభాతవార్త):**

రామరాజ్యంలా సీఎం జగన్ పాలన సాగుతోందని వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండ ల కేంద్రంలో జరిగిన నూతన పెన్షన్ల పంపిణీలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని మాట్లా డా రు. మలిసందెలో ఆసరా కోసం ఎదురుచూసే అవ్వాతాతలకు సీఎం జగన్ అండ గా నిలుస్తున్నారన్నారు. వారికిచ్చే వృద్ధాప్య పింఛన్ల మొత్తాన్ని ఇచ్చిన మాట ప్రకారం పెంచుతూ ఇళ్ల వద్దే పింఛన్లు అందజేస్తున్నారన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పేదల పక్ష పార్టీ అని అన్నారు. ఏ ఒక్క పెన్షన్ తొలగించకుండా కొత్త పెన్షన్లను మంజూరు చేసి వైఎస్ జగన్ పేదల పక్షపాతి అని నిరూపించారన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ ఫైలులో చంద్రబాబు 13 చోట్ల సంతకాలు చేశారుః తండ్రి వైఎస్ఆర్ అధికారంలో ఉన్నప్పుడు వైఎస్ జగన్ ఏ రోజూ ఏ కార్యా లయా నికి వెళ్లలేదని, గాలివీడు మండలంలో నూతన పెన్షన్లఉ మంజూరు 321ః రాయ చోటి నియోజకవర్గంలో ప్రస్తుతం నూతనంగా 2271 పెన్షన్లు మంజూరైనట్లు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గాలివీడు మండలంలో 321 పెన్షన్లు మంజూ రయ్యా యన్నారు. వినాయక చవితి పండుగ సమయంలో నూతన పెన్షన్లు మంజూరుతో వృద్దుల కళ్లలో సంతోషాలు కనపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతమ్మ, వైస్ ఎంపీపీ మిట్టిపల్లె యదుభూషణ్‌రెడ్డి, ఎంపీడీఓ శేఖర్‌నాయక్, మైనార్టీ సీనియర్ నాయకులు ఖాదర్‌మొహిద్దీన్(ఎస్‌కె), మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు నాగభూషణ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ-2 శ్రీనివాసులు, సర్పంచులు ఉమా పతిరెడ్డి, కేశవరెడ్డి, దీప్తి, ఎంపీటీసీలు, మాజీసర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, వైకాపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయకచవితి ఉత్సవాలు





**పీలేరు, వాల్మీకిపురం, కేవి.పల్లె, ప్రభాతవార్తః**

వాల్మీకిపురం మండలంలో సోమవారం వైభవంగా వినాయకచవితి ఉత్సవాలను మండల ప్రజలు జరుపుకున్నారు. వాల్మీకిపురం పట్టణంలోని కోనేటి వీధి, శ్రీలక్ష్మి కామేశ్వరస్వామి వారి ఆలయంలోని గణపయ్యకు వినాయక చవితి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని జలాభిషేకం, క్షీరాభిషేకం పంచా మతాభిషేకం కార్యక్రమాలు అనంతరం స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పండుగ సందర్భంగా వినాయక ఉత్సవ కమిటీల ఆద్వర్యంలో పట్టణంలోని తోట వీధిలో 22 అడుగుల విగ్రహం ప్రతిష్టించారు. కుమ్మరవీధి, ఎన్టీఆర్, కాలనీ, బజారువీధి, తిరుచట్టి వీధి, కొత్తపేటవీధి, బైపాస్‌రోడ్డు, ఇంది రమ్మకాలనీ, రామ్‌నగర్‌కాలనీ ప్రాంతాల్లో భారీ విగ్రహాలను ప్రతిష్టించారు. కుమ్మర వీధి, ఎన్టీఆర్‌కాలనీ, బజారు వీధి, తిరుచట్టి వీధి, కొత్తపేట వీధి, బైపాస రోడ్డు, ఇందిరమ్మ కాలనీ, రామ్‌నగర్‌కాలనీ ప్రాంతాల్లో భారీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. మండలంలోని చింతపర్తి, గండబోయినపల్లె ప్రాంతాల్లో వందలాది గణపతి విగ్రహాలను ప్రతిష్టించి విశేష పూజలు నిర్వహించారు.

### పీలేరులో

**పట్టణంలో 125 విగ్రహాలు**

వినాయకచవితి పురస్కరించుకుని పీలేరు పట్టణంలో భక్తాదులు 125 విగ్రహా లను ఏర్పాటు చేశారు. రాయలసీమలో వినాయక చవితిని పీలేరు పట్టణంలో ప్రత్యేకంగా జరుపుకోవడం ఆనవాయితీ. సోమవారం పట్టణంలో వివిధ ప్రాంతా ల్లో కొలువుదీర్చిన గణనాదులను బుధవారం సమీపంలోని అయ్యప్ప నాయుని చెరువలో నిమజ్జనం చేయనున్నారు. విగ్రహాలు ఒకేసారి నిమజ్జనం చేయనుం డటంతో పీలేరు, చుట్టుపక్క ప్రాంతాల నుంచి కూడా నిమజ్జనం కార్య క్రమాలను వీక్షించుటకు ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తారు, బుధవారం అన్ని విగ్ర హాలు పోలీ సులు ఇచ్చిన వరుస సంఖ్య ప్రకారం కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి వరుసగా నిలబెడుతారు. అక్కడ పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వేదపండితులు పూజలు చేసిన అనంతరం విగ్రహాలు పురవీధులలో ఊరేగుతూ అయ్యప్ప నాయుని చెరువు వద్దకు చేరుకుంటాయి ఊరేగింపు గాంధీవీధి, సదుం మార్గంలో పాతబస్టాండు మీదుగా ఎల్‌బీయస్ రోడ్డు, కడప మార్గంలోని అయ్యప్పనాయుని చెరువులో నిమజ్జనం చేస్తారు. స్థానిక సర్పంచి హబీబ్‌బాషా ప్రత్యేక చొరవ చూపి అయ్యప్పనాయుని చెరువులోకి విగ్రహాలు సులభంగా వెళ్లేందుకు జేసీబీల సహా యం ఏర్పాటు చేశారు. వీధిలైట్లు ఏర్పాటు చేశారు.

### కేవి.పల్లె

వాడవాడలా వినాయక చవితి విగ్రహాలను ఘనంగా ఏర్పాటుచేశారు. వినా యక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయాలలో ప్రత్యేక పూజ లు, అభిషేకాలు నిర్వహించారు. వినాయకునికి అత్యంత ప్రీతికరమైన ఉండ్రాళ్లను వివిధ రకాల పండ్లతో పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఓటరు జాబితాలో రాజకీయ పార్టీల ఫిర్యాదులు 90 శాతం పరిష్కరించాం



**రాయచోటి, సెప్టెంబర్19, ప్రభాత వార్త:**

అన్నమయ్య జిల్లాలో ఓటరు జాబితాకు సంబందించి రాజకీయ పార్టీల నుంచి అందిన ఫిర్యాదులను 90 శాతం పైగా పరిశీలన పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ గిరీష పియస్, రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేస్ కుమార్ మీనాకు వివరించారు. మంగళవారం ఎలక్షన్ కమిషన్ కారా ్యలయం నుండి 2024 ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధి కారి ముఖేష్‌కుమార్ మీనా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిం చారు. ఈ స oదర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024 ఓటరు జాబితా సవరకు సంబంధించి రాజకీయ పార్టీల నుండి 40358 ఫిర్యాదులు అందాయని వాటిని 90శాతం పూర్తి చేశామని వివరించారు. రాజకీయ పార్టీలతో ఈ నెల 20వ తేదీన జిల్లా స్థాయి సమావేశం నిర్వహిస్తామని తుది జాబితాను ఎలక్షన్ కమిషన్‌కు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ అక్టోబర్ 17 నాటికి అన్నింటినీ పూర్తి చేసి పబ్లిష్ చేయాల్సి ఉంటుందని సూచిం చారు. ఈ కార్యక్రమంలో జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్,డిఆర్ఒ సత్యనారాయణ, ఆర్డీఓ రంగస్వామి, జిల్లా ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు

## మీ సేవలు అభినందనీయం..స్ఫూర్తిదాయకం

### – అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని అభినందించిన ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్



**కడప క్రైం, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**

ఇటీవల కాలంలో జిల్లాలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన పోలీసు సిబ్బం దిని జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. స్ఫూర్తిదాయకమైన సేవలు అందించి పోలీసు శాఖ కీర్తి ప్రతిష్టలు పెంపొందించారని ముమ్ముందు ఇదే స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రొద్దుటూరు టుటౌన్ స్పెషల్ బ్రాంచి హెడ్ కానిస్టేబుల్ చంద్ర నాయక్, తాళ్ల ప్రొద్దుటూరు స్పెషల్ బ్రాంచి కానిస్టేబుల్ వెంకటశివలను ఎస్పీ అభినందించారు. ఈనెల 16న రాత్రి హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంపై తక్షణం స్పందించి బాధితులకు సకాలంలో వైద్యం అందించిన ఖాజీపేట నైట్ పెట్రోలింగ్ బీట్ సిబ్బంది గురువయ్య, హోంగార్డు చంద్రశేఖర్‌రెడ్డిలను ఎస్పీ అభినందించారు. ఈనెల 17న శిల్పారామం సమీపంలో విధుల్లో ఉన్న బ్లూకోల్ట్ కానిస్టేబుల్ నాగేంద్ర, హోంగార్డు శ్రీనివాసులు రైలు పట్టాలపై అనుమానాస్పదంగా వెళ్తున్న ఓ యువకుడిని గుర్తించి వెంటనే పట్టాల వద్దకు వెళ్లి ట్రాక్‌పై నుంచి సురక్షితంగా పక్కకు తప్పించారు. ఇందిరానగర్ కు చెందిన యువకుడిగా గుర్తించి కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం చేస్తున్నట్లు తెలుసుకొని రిమ్స్ పీఎస్‌లో అప్పగించారు. రిమ్స్ పోలీసులు యువకుడికి కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

### చంద్రబాబు విడుదల కావాలని

## కోదండరామాలయంలో ప్రత్యేక పూజలు



**ఒంటిమిట్ట సెప్టెంబర్19 ప్రభాతవార్త:**

స్థానిక కోదండరామాలయంలో ఉమ్మడి జిల్లాల తెలుగుదేశం పార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీ జాతీయ ఆద్యక్షుడు నారాచంద్రబాబునాయుడు త్వరగా విడుదల కావాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఉద య ం నాయకులు కొత్తమాధవరం నుంచి పాదయాత్రగా వచ్చి కోదండ రామున్ని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల పార్టీ అధ్య క్షులు లింగారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రాజంపేట టిడిపి ఇన్‌చార్జి బత్యాల చెంగల్ రాయుడు, లక్కిరెడ్డి పల్లి ఇన్‌చార్జి రమేష్‌రెడ్డి, కడప ఇన్‌చార్జి మాదవిరెడ్డి, జమ్మలమడుగు ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి, బద్వేల్ ఇన్‌చార్జి రితీష్ రెడ్డి, రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి రెడ్యెం వెంకటసుబ్బారెడ్డి, పులివేందుల పార్ధసారదిరెడ్డి, టిడిపి నాయకులు ఎద్దుల సుబ్బరాయుడు, మండల పార్టీ ఆధ్యక్షుడు గజ్జల నర సింహారెడ్డి, సిద్దవటం ఆద్యక్షుడు మెహన్‌రెడ్డి, రాజంపేట ఆద్యక్షుడు సుబ్బ నరసయ్య, ఒంటిమిట్ట మండల ప్రదాన కార్యదర్శి బొబ్బిలిరాయుడు, జిల్లా నాయకులు, మండల నాయ కులు పాల్గొన్నారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా కడప డిఎస్‌పి, ఒంటి మిట్ట ఎస్ఐ మధుసూదన్‌రావు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## భూ రీసర్వేని పరిశీలించిన జాయింట్ కలెక్టర్



**దువ్వూరు, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**

దువ్వూరు రెవెన్యూ గ్రామ పొలంలో మంగళవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న భూ రీ సర్వే కార్యక్రమాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ గంగాదర్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా దువ్వూరు గ్రామ రెవెన్యూ పొలంలో ఉర్దూ బడి వెనక భాగాన ఉన్న పొలాల్లో సచివాలయం సర్వేయర్లు రీ సర్వే చేస్తున్నారు. వారి వద్దకు వెళ్లి భూ సర్వే ఎలా జరుగుతోందని పరిశీలిం చారు. భూ సర్వే చేయడంలో ఎటువంటి తప్పిదాలు చేయలేదని సక్రమంగా భూ రీ సర్వే పూర్తి చేయాలని అలాగే రీ సర్వే సమయంలో ఆ భూమికి సంబంధించిన రైతులు ఉండేలా చూడాలన్నారు. రైతులు పొలం వద్ద ఉంటే ఎటువంటి సమస్యలు రావన్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యా లయంలో అసైన్‌మెంట్ భూములకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 20 సంవత్సరాలకు పైబడిన పేదలకు ఇచ్చిన అసైన్‌మెంట్ భూములకు సర్వ హక్కులు కల్పించేందుకు సిద్దవమైంది. వాటి రికార్డులు సక్రమంగా ఇవ్వాలన్నారు. అసైన్ మెంట్ చేసే సమయంలో ఎవరిపేరు మీద ఇచ్చారు, వారు ఉన్నారా లేదా, ప్రస్తుతం ఎవరున్నారు, విస్తీర్ణం ఎంత అనే వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రమాకుమారి, ఆర్ఐ జాన్సన్, సర్వేయర్ పద్మావతి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

### వరికూటి సూర్యనారాయణరెడ్డికి జాతీయ బంగారు నంది అవార్డు

2లో

### డిసిసి బ్యాంకు పరిధిలో ఈ స్టాంపు సేవలు ప్రారంభం

ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీ 2లో

## జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కొలువైన గణనాథుడు



రాజంపేటలో వినాయకునికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



కడప నగరంలోని రాజీవ్ పార్కుక వద్ద ఏర్పాటు చేసిన వినాయకునికి పూజలు నిర్వహిస్తున్న ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్



కడప డిసిఎంఎస్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద టిడిపి నాయకులు హరి ప్రసాద్, ఇతరులు



కడప నగరంలో కొలువుదీరిన వినాయకుడు

## కడపలో ప్రారంభమైన చవితి ఉత్సవాలు



కడప వైద్యవిభాగం, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:

వినాయక చవితి పండగ సందర్భం గా సోమవారం కడపలో పలుచోట్ల వినా యకుని విగ్రహాలు పెట్టి పూజలు నిర్వ హించారు. కడప ఎన్జీవో కాలనీలో అత్యంత భారీ విగ్రహాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఏడురోడ్ల కూడలి వద్ద కూడా భారీ విగ్రహాలు పెట్టారు. ఉప ముఖ్య మంత్రి అంజాద్‌బాషా, నగర మేయర్ సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ నిత్యానం దరెడ్డి వినాయకుని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని వినాయక స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఏడురోడ్ల కూడలి వద్ద కమిటీ సభ్యులు గంజికుంట రవీంద్రనాథ్, పద్మప్రియ చంద్రారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో గంజికుంట గణేష్, విష్ణుకుమార్, వెంకటరెడ్డి, శ్రీనివాసులు, నాగభూషణం, సురేంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

## సైనిక్ స్కూల్ రావడం విద్యార్థులకు వరం

### –ఆర్మ్‌డ్ ఫోర్స్ వెటర్నన్స్ జిల్లా అధ్యక్షుడు ఫిలిప్

వైవీయూ, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త:

కడప జిల్లాకు మరో సైనిక్ పాఠశాల రావడం ఈ ప్రాంత విద్యార్థులకు ఒక వరంల ఉపయోగ పడుతుందని ఆర్మ్‌డ్ ఫోర్స్ వెటర్నన్స్ జిల్లా అధ్యక్షులు ఫిలిప్ ఒక పకటనలో తెలిపారు. పులివెందుల తాలూకాలోని నల్లపరెడ్డిపల్లె ఉన్నత పాఠశాలను సైనిక్ స్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయడం హర్షించ దగ్గ విషయం అన్నారు. సైనిక్ స్కూల్‌లో చదివిన విద్యార్థులకు త్రివిధ ధళాల్లో పనిచేయుటకు ఉన్నత అవకాశాలు వస్తాయన్నారు. స్కూలు మంజూరు చేసిన ప్రధానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎంపికి కృతజ్ఞతలు తెలిపారు. బిఆర్‌ఓ ( బ్రాంచ్ రిక్రూట్‌మెంట్ ఆఫీస్), మిలటరీ సెలక్షన్ కారా ్యలయం కోసం కృషి చేయాలని పార్లమెంట్ సభ్యులకు వినతి పత్రం సమర్పించినట్లుతెలిపారు.

## చంద్రబాబు అరెస్టు అనాగరిక చర్య

పులివెందుల రూరల్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త :



నారా చంద్రబాబునాయుడు అరెస్టు అనాగరిక చర్య అని తెలుగుయువత నాయకులు అన్నారు. నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా పులివెం దులలో టీడీపీ ఇన్‌ఛార్జి బీటెక్ రవి ఆధ్వర్యంలో స్థానిక తెదేపా కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తెలుగు యువత నాయకులు, జనసేన పార్టీ తరపున 30మంది రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సంద ర్భంగా తెలుగు యువత నాయకులు మాట్లాడుతూ సీఎంగా పనిచేసినంత వరకు యువతకు ఐటీ విప్లవం తెచ్చి మార్గదర్శకుడిగా చంద్రబాబు నిలిచాడన్నారు. అటువంటి నేతను అన్యా యంగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడి అక్రమ అరెస్టు చేయ డం తగదన్నారు. వచ్చే ఎన్నికల్లో వైకాపాకు యువత తగిన బుద్ధిచెప్పడం ఖాయం అన్నారు. జగన్ నాలుగేళ్ల పాలనలో ఒక్క ఫ్యాక్టరీ నిర్మించలేదని, ఒక డీఎస్సీ కూడా విడుదల చేయకుండా యువత భవిష్యత్తును చీకటి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కులుగారి విజయ్‌కుమార్‌రెడ్డి, కార్యనిర్వహణ కార్యదర్శి అజ్జుగుట్టు రవి తేజరెడ్డి, జిల్లా అధ్యక్షుడు సుధీర్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుచ్చ మనోజ్‌రెడ్డి, నియోజకవర్గ అధ్య క్షుడు సాయినాథ్‌రెడ్డి, మున్సి పాలిటీ,అధ్యక్షుడు వెంక టేశ్వరరెడ్డి (పటాల బాబు) చిలకల మహేష్ పాల్గొన్నారు.

**– జనసేన యువత మద్దతు :**

చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా తెదేపా చేపట్టిన రిలే నిరాహార దీక్షకు జనసేన పార్టీ యువత మద్దతు ఇచ్చారు. ఆ పార్టీకి చెందిన యువ నాయకులు తెదేపాకు మద్దతుగా ఉమర్, షరీఫ్, బాబు, ఇబ్రహీం, విశ్వ నాథ నిరాహార దీక్ష చేపట్టారు.

## కొండాయపల్లెలో వరసిద్ధి వినాయక ఉత్సవాలు

కడప వైద్యవిభాగం, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:

కడప నగరం 6వ డివిజన్ 4వ రోడ్డు రామాలయం వద్ద ఏర్పాటు చేసిన శ్రీవరసిద్ధి వినాయక ఉత్స వాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సంద ర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భకక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం వైసీపీ 6వ డివిజన్ ఇన్‌ఛార్జి సుధాకర్‌నాయుడు, శివకృష్ణ వినరగహ దాత నవీన్‌కుమార్ మాట్లాడుతూ 11సంవత్స రాలుగా వరసిద్ధి వినాయక ఉత్స వాలు తమ వీధి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉత్స వ ఆర్గనైజర్లు, మహిళలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## నిమజ్జనం సమయంలో జాగ్రత్తలు పాటించాలి



పులివెందుల, సెప్టెంబరు 19, ప్రభాతవార్త :

వినాయక విగ్రహాల నిమజ్జనం సమయంలో ప్రజలు జాగ్రత్తలు పాటించా లని పులివెందుల అర్బన్, రూరల్ సీఐలు రాజు, బాలమద్దిలేటి తెలిపారు. తొండూ రు మండలంలోని ఇనగలూరు బ్రిడ్జి వద్ద నిమజ్జనం జరిగే ప్రాంతాలను మంగళ వారం వారు పరిశీలించారు. కార్యక్రమంలో మున్సి పల్ కమిషనరు నర సింహా రెడ్డి పాల్గొన్నారు.

## హనుమద్వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి

పులివెందులరూరల్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త



పులివెందులలోని శ్రీరంగనాథస్వామి ఆలయం లో మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగ నాథ స్వామి ఉత్స వమూర్తులను హనుమద్వాహనం పై కూర్చో బెట్టి భక్తులకు దర్శింపచేశారు. శ్రీరంగడి నూలుపూజోత్స వాల్లో భాగంగా పద్మశాలీలు నూలును అమ్మువారికి సమర్పి స్తారు. కార్యక్రమాల్లో ఆలయ ఛైర్మన్ చింతకుంట సుధీకర్ రెడ్డి, ఈవో వెంకట రమణ, ఆలయ ప్రధాన అర్చకులు సోమేపల్లె క్రిష్ణరాజేష్శ్మ పాల్గొన్నారు.

## వినాయక చవితి ఉత్సవాల్లో అమీర్‌బాబు

కడప వైద్యవిభాగం, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:



కడప నగరంలోని 28వ డివిజన్ ఇన్‌ఛార్జి గాజులపల్లె రాఘవ ఆధ్వర్యం లో జరుగుతున్న వినాయక చవితి ఉత్స వాలలో తెదేపా సీనియర్ నాయ కులు వి.ఎస్.అమీర్‌బాబు పాల్గొని స్వామి వారి కి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు, పాల్గొన్నారు.

## పార్లమెంటులో ఓబీసీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

### సంచార జాతుల రాష్ట్ర నాయకులు కంభం వెంకటేశ్వర్లు డిమాండ్

ప్రొద్దుటూరు సెప్టెంబర్ 19, ప్రభాతవార్త



ఈనెల 18 నుండి 22 వరకు జరుగు తున్న అత్యవసర పార్లమెంటు సమావేశాలలో కేంద్ర ప్రభుత్వం ఓబిసి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని సంచార జాతుల రాష్ట్ర నాయ కులు కంభం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన పత్రికా ప్రకటన విడుదల చేస్తూ ఓబిసి వర్గీకరణ బిల్లుపై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణిని ఎండ కట్టాలని ఆయన పిలుపునిచ్చారు ఓబీసీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టడం వల్ల బీసీలలో అత్యంత వెనుకబడిన వర్గాలైన సంచార జాతుల జీవితాలలో ఎన్నో ఇబ్బందులు కష్టాలు తీరిపోతాయని పేర్కొన్నారు సంచార జాతుల విద్య ఉద్యోగ రాజకీయ రంగాలలో పాటు ఆర్థికంగా కూడా అభివృద్ధి చెందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు తక్షణమే సంచార జాతుల అభివృద్ధి కోసం అయినా అత్యవ సర పార్లమెంటు సమావేశాలలో ఓబి సి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పార్లమెంటులో బిల్లు ప్రవేశ పెట్టిన కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

## వాడవాడన భక్తి శ్రద్ధలతో గణనాధునికి పూజలు



రాజుపాళెం,సెప్టెంబర్19,ప్రభాతవార్త.

మండల పరిదిలోని వాడవాడలలో ప్రత్యేక అలంకరణతో ముస్తాబైన మంట పాలలో కొలుదీరిన గణనాధునికి ప్రజలు భక్తి శ్రద్ధలతో ప్రత్యేకపూజలు నిర్వ హించారు.ఈపర్వదినం చిన్న పెద్ద ఆడ,మగ తేడాలేకుండా ఎంతో సంతోషం గా సంబరాలు జరుపుకోవటంతో పాటు అనేక చోట్ల భక్తితో నిర్వహించు ఆటపాట లతో పోటీలు నిర్వహించారు.వినాయక చవితి సోమవారం కొన్ని చోట్ల,మరికొన్ని ప్రాంతాలలో మంగళవారం రెండు రోజులు పండుగను నిర్వహించుకొన్నారు. స్వామివారిని మంటపంనకు తెచ్చిన రోజునుండి మూడు,ఐదు,తొమ్మిది రోజులు పూజలు నిర్వహించి నిమజ్జనం కార్యక్రమంనను ఎంతో గొప్పగా ఊరేగింపుతో కె.సి కాలువ, కుందూనదికి తీసుకెళ్ళి నిమజ్జనం చేయటం ఇక్కడి సాంప్ర దాయం, రైతులు వినాయక చవితి పండగను పవిత్రంగా జరుపుకోవటం గ్రామా లలో విశేషం.

## కౌలు రైతుల సమస్యలను పార్లమెంటులో చర్చించాలి

### వంగిమళ్ళ రంగారెడ్డి

రాయచోటి, సెప్టెంబర్19,ప్రభాత వార్త:

దేశవ్యాప్తంగా కౌలు రైతుల సమస్యలను ప్రస్తుత పార్లమెర్ట్ సమావేశాల్లో చర్చించాలని వారికి న్యాయం జరిగేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలని రాష్ట్ర కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంగిమళ్ళ రంగారెడ్డి డిమాండ్ చేశారు. రాయచోటి పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కౌలు రైతుల సంక్షేమం కోసం దేశవ్యాప్తంగా సమగ్ర కౌలు చట్టం తీసుకురవాలన్నారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని కౌలు రైతులకు వర్తింపజేసి ప్రతి ఎకరానికి ఏడాదికి 15000 రూపా యలు పెట్టుబడి సాయం కింద పంట రుణాలు ఇవ్వాలని తెలిపారు.

## చంద్రబాబుకు బాసటగా మైనార్టీ మహిళలు

రాయచోటి, సెప్టెంబర్19,ప్రభాత వార్త:

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు బాసటగా రాయచోటి నియోజకవర్గం మైనార్టీ మహిళలు నిరసన వ్యక్తం చేశారు. రాయచోటి పట్టణం తెలుగుదేశం పార్టీ కార్యాలయ ఆవరణంలో మంగళవారం నియోజకవర్గ ంలోని మైనార్టీ మహిళలు చంద్రబాబునాయుడుపై అక్రమకేసులకు నిరసనగా రిలేనిరా హార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైనార్టీ మహిళలు ప్రసంగిస్తూ ఒక నియంతపై పోరాటం కోసం తాము బయటకు వచ్చి గళమెత్తినట్లు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీపై పెట్టిన అక్రమ కేసులకు భయపడేదిలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో రమేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసుల్లో నుండి త్వరలో బయటకు వస్తాడని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శాంతియుత ఉద్యమాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పోలీసులను అడ్డుపెట్టుకొని తెలుగుదేశం నాయకులను, కార్యకర్తలను భయపెట్టడానికి ప్రయత్నిస్తున్నాడని ఈ బెదిరింపులకు తాము బెదిరేదే లేదని తెలిపారు.

## ప్రజల దీవెనే శ్రీరామరక్ష

### – లయన్స్ క్లబ్ అధ్యక్షుడు

కడప వైద్యవిభాగం, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:



అన్ని దానాల్లో కల్లా అన్నదానం గొప్పదని ప్రజలు దీవెనే శ్రీరామ రక్ష అని లయన్స్ క్లబ్ ఆఫ్ అన్నమయ్య అధ్యక్షు లు పోతుల వెంకటరామిరెడ్డి అన్నారు. స్థానిక ఏడురోడ్ల కూడలిలోని పోతుల ట్రావెల్స్ వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ అన్న మయ్య ఉపాధ్యక్షుడు గౌరీ శంకర్‌రెడ్డి, రిటైర్డ్ సూపరింటెండెంట్ మెడికల్ అండ్ హెల్త్ అధికారి చంద్రశేఖర్ జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ సంద ర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ అన్నమయ్య చిన్నపరెడ్డి మాట్లాడుతూ ఆకలితో ఉన్న వారికి పట్టెడు అన్నం పెట్టడం పుణ్యకార్యమన్నారు. గౌరీశంకర్ మాట్లాడుతూ పేదలకు రోజు ఉదయం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేయడానికి ముం దుకు పోతున్నామన్నారు. ఇతర దేశాల్లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 365 రోజులు అన్నదానాలు జరుగుతున్నాయని కడపలో కూడా నాంది పలుకుతా మన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సభ్యులు డా.రంగనాథ్‌రెడ్డి, పోతుల ట్రావెల్స్ అధినేత పోతుల ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

## చంద్రబాబుకు బెయిల్ కోసం గణపయ్యకు పూజలు

### – 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కుబడి

సంబేపల్లె, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:



చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా త్వరగా బెయిల్ మం జూరు కావాలని సంబేపల్లె మండల కేంద్రంలో ఎన్‌టీఆర్ మార్కెట్‌లో గల వినా యక స్వామికి 101 టెంకాయలు కొట్టి మొక్కుబడిని తీర్చుకొని సంబేపల్లి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికార పార్టీ నాయకులు పెట్టే తప్పుడు కేసులకు భయపడేదిలేదని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. 40 సంవత్స రాల సుదీర్ఘ రాజకీయ అనుభవం గల మాజీ సీఎంను అరెస్టు చేయడం వైకాపా నాయకుల అరాచక పాలనకు పరాకాష్ట అన్నా రు. సైకో పోవాలి, సైకిల్ రావాలి అని సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ జాతీయ రహదారిపై ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు నాగేశ్వర్‌నాయుడు, శశిదర్‌రెడ్డి, రాజంపేట పార్లమెంటు కార్యదర్శులు సుబ్బ రాజు యాదవ్, శ్రీనివాసులు నాయుడు, టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, భాస్కర్, శేషాద్రిరెడ్డి, టీడీపీ యూత్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## మురుకూటి సూర్యనారాయణరెడ్డికి జాతీయ బంగారు నంది అవార్డు

ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త



మురుకూటి సూర్య నారాయణ రెడ్డి సేవా ట్రస్ట్ ఛైర్మెన్ సూర్యనారాయణ రెడ్డికి వల్లూరి ఫౌండేషన్ వారు హైదరా బాద్ రవీంద్ర భారతి నందు జాతీయ బంగారు నంది అవార్డును 2023 సంవత్స రానికిగాను అందజేసి సత్కరిం చారు. ఈ అవార్డును శ్రీశ్రీశ్రీ నిత్య నిర్మలా నంద యాత్ర యోగేశ్వర స్వామి చేతుల మీదు గా ఆదివారం అందుకున్నారు. సూర్యనారా యణ రెడ్డి 40 సంవత్సరాల నుండి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ, పలువురికి విద్యను అందించడంలో సహాయ పడుతూ, అనేక మెడికల్ క్యాంప్‌ల ద్వారా ప్రజలకు సేవనందిస్తున్నందుకు గాను ఆయన ఈ అవార్డును ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మురు కూటి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ తనకు చదువు పెద్దగా లేకపోయినా అనేక సేవా సంస్థలలో పాల్గొంటూ ప్రజ లకు సేవ చేసే అవకాశం రావడం సంతోషదాయకం అన్నారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు, మిత్రులు హర్షం వ్యక్తపరిచారు.

## వినాయక చవితి సందర్భంగా అన్నదానం



ప్రొద్దుటూరు సెప్టెంబర్ 19, ప్రభాతవార్త

ప్రొద్దుటూరు పట్టణం ఎర్రన్న కొట్టా లలో వినాయక చవితి సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ ఆధ్వర్యంలో మంగళ వారం అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. వినాయక చవితి సందర్భంగా ఎర్రన్న కొట్టాలలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహానికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారం భించారు ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వినాయక చవితి పండుగ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకర మన్నారు ప్రొద్దుటూరు పట్టణ ప్రజలు ఆయురా రోగ్య ఐశ్వర్యాలతో వినాయకుడు ఆశీస్సులు కలగజేయాలని ఆయన ఆకర్షించారు కార్యక్రమంలో కౌన్సిలర్ వై జయంతి వైసిపి జిల్లా అధికార ప్రతి నిధి పగిడాల దస్తగిరి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రవీణ్‌రెడ్డి పాదయాత్రకు సంఘీభావం తెలిపిన నల్లబోతుల



ప్రొద్దుటూరు సెప్టెంబర్ 19, ప్రభాతవార్త

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు నేపథ్యంలో జైలు నుండి విడుదల కావా లని కోరుతూ ప్రొద్దుటూరు టిడిపి నియో జకవర్గ ఇంచార్జ్ "ప్రవీణ్ కుమార్ రెడ్డి" చేపట్టిన తిరుమల పాదయాత్ర కు తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు సంఘీభావం తెలిపారు. ప్రవీణ్ కుమార్ రెడ్డి పాదయాత్ర రైల్వే కోడూరులో కొనసాగు తున్న క్రమంలో యాత్రకు మద్దతుగా ఆయన పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు నుండి తిరుమల వరకు ప్రవీణ్‌కుమార్ రెడ్డి చేపట్టిన పాదయాత్రకు సంఘీభావంగా యాత్రలో పాల్గొన టం ఎంతో సంతోషాన్నిచ్చిందని తెలిపారు. ప్రవీణ్ కుమార్ రెడ్డి కోరుకున్న కోరిక నెరవేరాలని ఆ తిరుమల ఏడుకొండల స్వామిని మనస్ఫూర్తి గా కోరు కుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వనాథ్, శ్రీనివాస్ నగర్ యాకోబు, పల్లా సాయిరాం పాల్గొన్నారు.

## డిసిసి బ్యాంక్ పరిధిలో ఈ స్టాంపు సేవలు ప్రారంభం

### ఆప్కాబ్ ఛైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీ



ప్రొద్దుటూరు సెప్టెంబర్ 19, ప్రభాతవార్త

ప్రొద్దుటూరు డిసిసి బ్యాంక్ ఆధ్వ ర్యంలో ఈ స్టాంపు సేవలు ప్రారంభిం చినట్లు ఆప్కాబ్ ఛైర్పర్సన్ మల్లెల ఝాన్సీ వెల్లడించారు. మంగళవారం స్థానిక డిసిసి బ్యాంకులో ఆమె విలే కరులతో మాట్లాడుతూ ప్రొద్దు టూరు పట్టణ ప్రజల సౌకర్యం డిసిసి బ్యాంక్ ద్వారా ఈ స్టాంపింగ్ సౌకర్యాన్ని అందుబాట లోకి తెచ్చినట్లు తెలిపారు వీటి ద్వారా ప్రజలకు కావలసిన అన్ని రకాల స్టాంపు పత్రాలు ఎటువంటి అంతర్గత చార్జీలు లేకుండా సాధారణ రుసుముకే పొందవచ్చు అన్నారు డిసిసి బ్యాంకులో డిపాజిట్లు పెంచేందుకు బ్యాంకు సిబ్బంది ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సిబ్బంది జిల్లాలోని ప్రజా ప్రతినిధులను అధికారులను నేరుగా కలిసి డిపాజిట్ల సేకరణ ఆమె తెలిపారు రాష్ట్రంలో సహకార బ్యాంకులు మరియు సొసైటీలో మనుగడ చాలా అవసరం అని గుర్తించి డిపాజిట్ల సేకరణ ద్వారా ప్రజలకు మరిన్ని రుణాలను అంద జేయడం జరుగుతుందన్నారు దీనివల్ల జిల్లాలోని ప్రజా ప్రతినిధులకు ప్రజ లకు బ్యాంకు మీద హక్కుతో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని తెలి పారు నేడు సొసైటీల కంప్యూటర్ సంబంధించి చర్య చర్యలు తీసు కోవడం ప్రారంభమైందని తెలిపారు దీంతో త్వరలో గ్రామ గ్రామాన సొసైటీల ద్వారా అన్ని బ్యాంకింగ్ సౌకర్యాలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయ త్నం జరుగుతుందన్నారు సొసైటీల ద్వారా ప్రజలకు రైతులకు స్వయం సహా యక బృందాలకు ఆర్బిఐలకు అనుసంధానంగా గ్రామీణ ప్రాంతాల్లో కూడా మరిన్ని సేవలు అందుబాటులోకి రానున్నట్లు ఆమె తెలిపారు. అనం తరం బ్యాంక్ మేనేజర్‌తో పాటు సేవలను ప్రారంభించారు ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మల్లెల రాజారాం రెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక చవితి వేడుకలు

ఒంటిమిట్టసెప్టెంబర్18 ప్రభాతవార్త:



మండలంలో సోమవారం వినాయక చవితి వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకున్నరు. మండలంలోని అన్ని గ్రామాలల్లో వినాయకుని విగ్రహా లను ఏర్పాటు చేశారు. మండలంలోని కొత్త మాధ వరం, కొండమాచుపల్లి, పెన్న పేరూరు, నరసన్నగారి పల్లి, గంగపేరూరు, కొత్తపల్లి, ఇబ్రహీం పేట, రాచ పల్లి, సాలాబాద్ మలకాట్‌పల్లి, నడింపల్లి, మంటపంపల్లి, చింత రాజు పల్లి, కొన రాజుపల్లి గ్రామాలలో వినాయక విగ్రహాలను ఏర్పటు చేశారు. ఈ సందర్భం గా అన్ని విగ్రహాల వద్ద ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వ హించారు. వినాయక విగ్ర హాల వద్ద మంటాపాలను నిర్వాహకులు వివిద రూపాలలో ఆలంక రించారు. ఒంటిమిట్టలోని మెయిన్‌బజారు, కల్లావీది, మాడావీది, వివేకానంద నగర్, బస్టాండ్‌వద్ద, దర్జీపల్లి రోడ్డునందు, హరిజనవాడలో వినాయక విగ్రహలను నిర్వహికులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏలాంటి సంఘటనలు జరగ కుండా యస్ఐ మదుసూదన్‌రావు గట్టి బందోబస్తును ఏర్పటు చేశారు.

## కొలువుదీరిన బొజ్జ గణపయ్యలు

దువ్వూరు సెప్టెంబర్ 19, ప్రభాతవార్త

వినాయక చవితి పర్వదినం సంద ర్భంగా మండల కేంద్రమైన దువ్వూరు తో పాటు పల్లెటూర్లలో కూడా బొజ్జ గణ పయ్యలు కొలువు తీరారు. ప్రత్యేక మందిరాలు ఏర్పాటు చేసుకొని భక్తులు పూజలు సమర్పించుకుంటున్నారు. మూడు రోజులపాటు విఘ్నేశ్వరునికి పూజలు సమర్పించి అనంతరం కుందూ నదిలో లేదా తెలుగు గంగ ప్రాజెక్టులో, లేదా చెరువులు ఇలా నీరు సమృద్ధిగా ఉన్న ప్రాంతానికి తరలించి అక్కడ వినాయకుడిని నీటిలో నిమజ్జనం చేస్తారు. ఈ వేడుకలు అంగరంగ వైభవంగా సాగుతాయి. నిమజ్జనం రోజున రంగులు చల్లుకోవడము నృత్యాల ప్రదర్శనలు చేయడం ప్రత్యేక ఆకర్షణంగా ఉంటుం ది. మండలంలో అన్ని గ్రామాలలో 104 విగ్రహాలు నిలుపుదల చేసినట్లు ఎస్ ఐ శ్రీనివాసులు తెలిపారు. నేడు 82 విగ్రహాలు నిమజ్జనంనకు వెళతాయని, మిగతా 22 విగ్రహాలు నాలుగు రోజు 5వ రోజు నిమజ్జనానికి వెళతాయని, వినాయక కమిటీ సభ్యులు తెలిపినట్లు పోలీసులు తెలిపారు. నిమజ్జనం లకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## ప్రసిద్ధ అభ్యుదయవాది, సాహితీవేత్త తాపీ ధర్మారావుకు నివాళి



వైవీయూ సెప్టెంబర్ 19, ప్రభాతవార్త

యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరి శోధన కేంద్రంలో విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య చింతా సుధాకర్, కుల సచివులు ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాదరెడ్డి ఆదేశాల మేరకు మంగళ వారం ప్రసిద్ధ అభ్యుదయ సాహితీవేత్త, పాత్రికేయులు, హేతువాది తాపీ ధర్మారావు 137వ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది ముందుగా తాపీ ధర్మారావు చిత్ర పటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. సి.పి.బ్రౌన్ భాషా పరి శోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా.చింతకుంట శివారెడ్డి మాట్లా డుతూ తాపీ ధర్మారావు గొప్ప అభ్యుదయ సాహితీవేత్త, పాత్రి కేయుడు, హేతువాది, సంఘ సంస్కర్త అని అన్నారు. ఆయన పూర్వీకులు తాపీ పనిచేయడంతో బండారు అనే ఇంటిపేరు తాపీగా మారిందన్నారు. ఆయన చిన్నతనం నుండి అభ్యు దయ భావాలు అలవరచుకున్నారని, దేవా లయాలపై బూతుబొమ్మలెం దుకు, పెళ్ళి, దాని పుట్టుపూర్వోత్తరాలు, ఇనుప కచ్చడాలు తదితర పుస్తకాలన్నీ అభ్యు దయ భావాలతోనే రాశారన్నారు. భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి మాట్లా డుతూ తాపీ ధర్మారావు గిడుగు రామ్మూర్తి పంతులు శిష్యుడు కావడం వల్ల వ్యావ హారిక భాషకు ప్రాధాన్యమిస్తూ జనవాణి, కాగడా తదితర పత్రికలను నడిపా డన్నారు. ఆ కారణం చేతనే తాపీ ధర్మారావు జయంతిని 'తెలుగు మాధ్య మాల దినోత్సవం'గా జరుపుకుంటున్నామన్నారు. ఆయన మాలపిల్ల, రైతు బిడ్డ సినిమాలకు మాటలు కూడా రాశారన్నారు. గ్రంథపాలకులు జి.హరి భూషణ రావు మాట్లాడుతూ ధర్మారావు స్వీయచరిత్రను'రాళ్ళు-రప్పలు' అనే పేరుతో పుస్తకంగా వెలువరించారన్నారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకట రమణ, మౌనిక, సిబ్బంది నీల కంఠేశ్వర్, హరికృష్ణ, రాణి, పాఠకులు రంగ పాల్గొన్నారు.

## హౌసింగ్ పనులను వేగవంతం చేయండి : ఎంపిపి



పెద్దమండ్యం సెప్టెంబర్ 19 ప్రభాతవార్త

హౌసింగ్ పనులను వేగవం తం చేయాలని ఎంపిపి పూర్ణచంద్రిక రమేష్ అన్నారు. మంగళవారం మండలం లోని అధికారులతో సమావేశం నిర్వ హించారు. ఇటీవల జరిగిన పల్లెబాట కార్య క్రమంలో హౌసింగ్‌బిల్లులు, ఇసుక, సిమెంటు, స్టీలు కొరత, కొత్తఇండ్ల మంజూరుకు చాలా మంది లబ్దిదారులు కోర దం అందరికి తెలిసిందే. బిల్లులు త్వరితగతిన వచ్చేలాచర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కొత్తగాఅర్హులైన వారికి కొత్త ఇండ్లు మంజూరుకు ప్రతిపాదనలు పంపా లన్నారు. జగన్ ప్రభుత్వంలో సంక్షేపథకాలను అందరికీఅందించి ప్రజల మన్ననలు పొందాలని దీనికి కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. పల్లెబాటలో వచ్చిన ప్రతి సమస్యను సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడివో శ్రీధర్, వైస్ఎంపిపి చంద్రారెడ్డి, ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు, హౌసింగ్ ఏఈ సందీప్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## అయోమయంలలో నీట్ విద్యార్థులు

మైదుకూరు సెప్టెంబర్ 19, ప్రభాతవార్త

2023- 2024 విద్యా సంవత్సరానికి నీట్‌కు సన్నద్ధమవుతున్న విద్యార్థులు పాత ఎన్సీఈఆర్టీ అనుసరించాలా లేక కొత్త ఎన్సీఈఆర్టీ పాఠ్యాంశాలను అనుసరించాలా అని అయోమయంలో పడ్డారని సీనియర్ వృక్షశాస్త్ర బోధకులు బొమ్మిశెట్టి రమేష్ పేర్కొన్నారు. గత ఏడాది ఎన్సీఈఆర్టీ పుస్తకాలలో మార్పులు, చేర్పులు చేశారని ఆయన తెలిపారు.ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమై 5మాసాలు గడుస్తున్నప్పటికీ పాఠ్యాంశాల విషయం%శీ%లో సంగ్దిగ్దం ప్రభుత్వప్రైవేటు నీట్ విద్యార్థుల్లోను, బోధకులలోను నెలకొని ఉందని అన్నారు.నీట్ విద్యార్థులకు వచ్చే ఏడాది మే 5న పరీక్ష నిర్వ హిస్తున్నట్లు ఎన్టీఏ అధికారులు ప్రక టించిన విషయం తెలిసిందే ఐనప్ప టికి నీట్ నిర్వహణ ఎన్‌టిఎ అధికా రులు ఈ గందరగోళాన్ని నివృత్తి చేయాలని రమేష్ కోరారు.

**పేరు మార్చుకోబడినది**

మద్దిరేవుల సుదర్శనరెడ్డి (పాతపేరు), తండ్రి : మద్దిరేవుల వెంకటరెడ్డి, పాస్‌పోర్టు నెం. L 4720901 డి.నెం. 2/50, రెడ్డివారిపల్లి గ్రా॥ మద్దిరేవుల పోస్టు, లక్కిరెడ్డిపల్లె మం॥ పిన్ 516 257 అన్నమయ్య జిల్లా, ఏపి. నా పేరు మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి (కొత్తపేరు)గా మార్చుకోబడినది. అందరూ గమనించగలరు.

## పండగ పూట బియ్యం లేక ప్రజలు ఆందోళన



తంబళ్లపల్లె, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:

వినాయక చవితి పండగ రోజు సైతం రేషన్ బియ్యం పంపిణీ కాక ప్రజలు ఆగ్రహంతో పండగ పూట కూడా మమ్మలను పస్తు పెడతారా అని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం తంబళ్లపల్లె పరసతోపు పంచాయతీ, కొండ కింద మేకల వారిపల్లి ప్రజలు ఆందోళనకు దిగారు. ఈ విషయమై ప్రజలు స్టోర్ డీలరు దిల్షాద్ బేగంను విచారించగా బియ్యం సిద్ధంగా ఉన్నాయని ట్రక్కు డ్రైవరు రావడం లేదని చెప్పారు. సర్పంచ్ శ్రీనివాసులు సహకారంతో ప్రజలు తహసీల్దారుకు పిర్యాదు చేశారు. తహసీల్దారు శ్రీనివాసులు వెంటనే స్పందించి వాహన నిర్వాహకుడిపై చర్యలు తీసుకొని యుద్ధ ప్రాతిపదికన బియ్యం పంపిణీ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు కొండకింద మేకలవారిపల్లి గ్రామ స్థులకు బియ్యం పంపిణీ జరిగేలా చర్యలు చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## వర్గీకరణ బిల్లు పెట్టకపోతే రిలే కాస్త నిరాహారదీక్షే

– ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు భాస్కర్



తంబళ్లపల్లె, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:

ఢిల్లీలో ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణపై బిల్లు ప్రవేశపెట్టకపోతే నేడు జరుగుతున్న రిలే దీక్షలు కాస్త నిరాహారదీక్షలుగా మారి ఆందోళనలు ఉధృతం చేస్తామని మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు భాస్కర్ హెచ్చరించారు. మంగళవారం ఎమ్మార్పీఎస్ దీక్షాశిబిరానికి మహిళలు, ఇతర నాయకులు రాకను స్వాగతించారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ ఇన్‌ఛార్జి వేటా మల్లికార్జున, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటప్ప, యువనేత జగదీష్‌లు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై మందకృష్ణ మాదిగ సారథ్యంలో దశాబ్దాలుగా జరుగుతున్న పోరాటాలు రాజకీయ పార్టీలు గుర్తించాలని అణగారిన మాదిగ సోదరుల ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టకపోతే అన్ని రాజకీయ పార్టీలకు శృంగభంగం తప్పదని హెచ్చరించారు.కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మారయ్య, చిన్నప్ప, కదిరప్ప, రమణ, ముద్దలదొడ్డి రమణ, చిన్నప్ప, బాబు, హరి, రమణ, రమణమ్మ, లావణ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రమ మసీదు, మదరసా నిర్మాణ పనులు పరిశీలించిన డీఎస్పీ



కలికిరి, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:

మండలంలోని గుట్టపాలెం పంచాయతీలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన పనులను మంగళవారం అన్నమయ్య జిల్లా డీఎస్పీ మహబూబ్ బాషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. గుట్టపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలో 1496/1 డికేటీ స్థలంలో కలికిరికి చెందిన సయ్యద్ జాఫర్ ప్రభుత్వ అనుమతి లేకుండా మదరసా, మసీదు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న గుట్టపాలెం గ్రామస్థులు తహసీల్దారు భాగ్యలతకు ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దారు వెంటనే సంఘటనా స్థలాన్ని సందర్శించి డీకేటి స్థలంలో ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టడం చట్ట వ్యతిరేకమని పనులను నిలపాలని సయ్యద్ జాఫర్‌ను ఆదేశించారు. దీంతో పనులు ఆగిపోయాయి. ఈ నిర్మాణం పనులు చేపట్టడంతో హిందూ, ముస్లిం మతస్థుల మధ్య గొడవలు సంభవించే ప్రమాదం ఉంటుందని గ్రహించడం జరిగింది. దీంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఎస్పీ మహబూబ్‌బాషా, కలికిరి ఎస్సై ఎస్.కె.రహీముల్లాలు స్థలాన్ని సందర్శించి ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్మానాలు చేపట్టడం మంచిదికాదని పనులు నిలిపేయాలంటూ సయ్యద్ జాఫర్‌కు డీఎస్పీ సూచించారు. డీఎస్పీ ఆ పనులపై స్థానిక సర్పంచ్ ఆర్.వెంకటరెడ్డిని, గ్రామస్థులను విచారించారు. ఇప్పటికే ఈ నిర్మాణ పనులపై జిల్లా విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి చింతపర్తి మహేష్ గ్రామస్థులతో కలిసి పనులు నిలిపేయాలంటూ తహసీల్దారుకు, జిల్లా స్థాయి అధికారులకు కూడా ఫిర్యాదు చేయడం జరిగింది. ఎట్టకేలకు నిర్మాణ పనులను నిలిపివేయాలని అధికారులు చెప్పడంతో వివాదం సర్దుమనిగింది.

## జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేని పరిశీలించిన ఎంపీడీవో



కలికిరి, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:

కలికిరి పంచాయతీ కలికిరి-2 పరిధిలో మంగళవారం జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేని మంగళవారం ఎంపీడవో గంగయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్వేని వేగవంతం చేయాలని అదే విధంగా వైద్యసిబ్బంది, వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులపై సర్వే నిర్వహించి అనారోగ్యానికి గురైన వారిని గుర్తించి హెల్త్ క్యాంప్‌లకు వచ్చే విధంగా చూడాలని ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో కలికిరి-2 పంచాయతీ కార్యదర్శి విజయేంద్ర పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ ప్రక్రియపై కార్యదర్శులకు శిక్షణ

కలికిరి, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:



కలికిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ పర్వీన్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా భూములు, ఇళ్లు తదితర వాటిపై రిజిస్ట్రేషన్ ఎలా చేయాలి అనే అంశాలపై కార్యదర్శులకు విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు గోపి, మయూరి, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయకచవితి పండగ

వాడవాడ వెలసిన వినాయక విగ్రహాలు

పూజల్లో పాల్గొన్న ప్రముఖులు



మదనపల్లె, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త :

వినాయకచవితి పండగను సోమవారం పట్టణంలో ప్రజలు ఘనంగా నిర్వహించారు. వాడవాడ వినాయక విగ్రహాలను భారీగా ఏర్పాటు చేసి వైభవంగా పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి విగ్రహాల వద్ద పూజలు నిర్వహించారు. పట్టణంలోని పలు ఆలయాల్లో వినాయక చవితి పూజలు నిర్వహించారు. పలు వార్డుల్లో విగ్రహాలు ఏర్పాటు చేసి ఘనంగా పూజలు నిర్వహించి భజనలు చేశారు. శుక్రవారం, ఆదివారాల్లో వినాయక విగ్రహాలను భారీగా ఊరేగింపుతో నిమజ్జనం చేయనున్నారు. ఇళ్ళల్లోనే పలువురు వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. పట్టణంతో పాటు రూరల్ మండలంలో కూడా వినాయక చవితిపండగను ఘనంగా జరిపారు. కురవంకలో సర్పంచ్ పసుపులేటి చలపతి ఆధ్వర్యంలో వినాయకచవితి సందర్భంగా విగ్రహాల వద్ద పూజలు వైభవంగా జరిగాయి. గజమాలతో సర్పంచ్ కుటుంబీకులను స్వాగతించారు. జనసేన పార్టీ రాయలసీమ కోకన్వీనర్ రాందాస్ చౌదరి, మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వినాయక చవితి పండగ సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా డిఎస్పి కేశప్ప పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

## జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం



మదనపల్లె, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త :

జనసేన పార్టీ ఎన్‌ఆర్‌ఐ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పట్టణంలోని రాజభవన్ ఫంక్షన్‌హాలులో జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు శ్రీరామ రామాంజనేయులు, ఎన్‌ఆర్‌ఐ విభాగం దేవరాజు కిరణ్‌ల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం జరిగింది. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉచిత వైద్యశిబిరంలో వివిధ విభాగాలకు చెందిన వైద్యులు పలువురికి ఉచితంగా వైద్యచికిత్సలు అందజేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు రామాంజనేయులు మాట్లాడుతూ పార్టీ కార్యకలాపాలు కేవలం రాజకీయాలకే అంకితం కాకుండా ప్రజల సంక్షేమం ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తొందన్నారు. జనసేన అధినేత పవన్‌కళ్యాన్ స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఉచిత వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మహిళా నాయకురాలు దారం అనిత, భార్గవి, సీనియర్ నాయకులు హరిప్రసాద్, దరణి,నరేంద్ర, గోపాలక్రిష్ణ, కిరణ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, ఆకుల శంకర్, వైద్యులు శంకర్ జగన్నాద్, కరీష్మా, సూర్యతేజ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ మాధ్యేయం

అంతిమ యుద్దానికి సిద్దం కండి

డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ ఎమ్మార్పీయస్ జాతీయ అద్యక్షులు



పీలేరు, సెప్టెంబరు 19 ప్రభాతవార్తః

ఎస్సీ షెడ్యూల్ కులాల వర్గీకరణ సాధనకై మహాజన నేత మందకష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరాహార దీక్ష శిబిరాలను నిర్వహిస్తున్నారు. మంద కష్ణ ఆదేశాల మేరకు రాయలసీమ జిల్లాలోని దీక్ష శిబిరాలను పర్యవేక్షణ నిమిత్తం ఎమ్మార్పీయస్ జాతీయ నాయకులు మున్నంగి నాగరాజు, మాదిగ పరిశీలన చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం రాత్రి ఎంఎస్పీ పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్ ఆధ్వర్యంలో పీలేరు నియోజకవర్గ కేంద్రం పీలేరు తహశీల్దారు కార్యాలయంలో నిర్వహిస్తున్న దీక్షాశిబిరానికి విచ్చేశారు. ఆయన వెంట అన్నమయ్య జిల్లా ఎమ్మార్పీయస్, ఇన్‌చార్జి కెస్ రాజు మాదిగ, రవీంద్ర మాదిగ ఉన్నారు. వారు మాట్లాడుతూ షెడ్యూల్ కులాల వర్గీకరణకు మహాజన నేత మందకష్ణ మాదిగ అలుపెరగని పోరాటం చేస్తున్నారని పార్లమెంటులో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టేందుకు బీజేపీతో తాడోపేడో తేలుసుకోవడానికి అంతిమ యుద్దానికి ఎమ్మార్పీయస్ శ్రేణులు సంసిద్ధంగా ఉండి అన్నగారి పిలుపు మేరకు ఏకార్యక్రమానికైనా ముందు ఉండాలన్నారు. ఈ కార్యక్రమానికి ఎంఎస్పీ పీలేరు ఇన్‌చార్జి గండికోట వెంకటేష్, సీనియర్ నాయకులు గురవయ్య, హుసేనయ్య, రాజేష్, చరణ్, ప్రసాద్, మల్లికార్జున, నాగరాజు, సుబ్బయ్య, నరేష్, మహేష్, చిన్న, రాము తదితర ఎమ్మార్పీయస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శివానగర్‌లో వైభవంగా వినాయక చవితి వేడుకలు

– వినాయకుని వద్ద రంగవల్లులు తీర్చిదిన మహిళలు

– మహిళలకు బహుమతులు అందజేసిన పీఎన్ఆర్ ఫౌండేషన్



బద్వేలు అర్బన్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:

పట్టణంలోని పలు ప్రాంతాల్లో వినాయక చవితి వేడుకలు గత 2రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శివానగర్‌లో వినాయ క చవితి వేడుకలు పురస్కరిం చుకొని ఆర్గనైజింగ్ కమిటీ కాలువ చెన్నయ్య, నాగరాజా, కొమ్మురాజు శ్రీనివాసులు, నారాయణ, తిరుపత య్య, మురళీ, నారాయణరెడ్డితో పాటు పలువురు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వినాయకుని వద్ద మహిళలు రంగవ ళ్లులను ప్రజలను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. మహిళలు వేసిన రంగవల్లులను న్యాయనిర్ణేతలు విజేతలను ప్రకటించి మొదటి బహుమతి సుచితకు రూ.2వేలు, 2వ బహుమతిగా వి.లక్ష్మీ కి రూ.1500, 3వ బహుమతి సుధాకు రూ.వెయ్యి, 4వ బహుమతి దివ్యకు రూ.వెయ్యి పెసల నాగరాజా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగరాజా సహకారంతో బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పలువురు శివానగర్ వాసులు, బి.వెంకటేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనాన్ని ఢీ కొన్న ఆటో

యువకుడు దుర్మరణం

మదనపల్లెక్రైం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త :



ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీ కొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందిన సంఘటన సోమవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. పోలీసుల కథనం మేరకు పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన రమణ, దనమ్మల కుమారుడు అరుణ్ (23) అదే ప్రాంతానికి చెందిన స్నేహితుడు అఖిల్ (23)లు కలసి సోమవారం రాత్రి ద్విచక్రవాహనంలో ఆర్టీసి బస్టాండ్‌కు వెళ్ళాడు. పని ముగించుకొని తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమద్యలోని సిటిఎం రోడ్డులో ద్విచక్రవాహానాన్ని ఆటో ఢీ కొంది. ఈ ప్రమాదంలో అరుణ్ అక్కడిక్కడే దుర్మరణం చెందగా అఖిల్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన అఖిల్‌ను జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్సలు పొందుతున్నాడు. రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యాపారుల కిడ్నాప్ కేసులో ఏడుగురు అరెస్టు

మదనపల్లెక్రైం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త :

మదనపల్లెలోని టైల్స్ వ్యాపారుల కిడ్నాప్ కేసులో ఏడుమందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సిఐ మహబూబ్‌బాషా తెలిపారు. పట్టణంకు చెందిన ఆర్కేటైల్స్ నిర్వాహకులు నగేష్, శ్రవణ్‌కుమార్‌లు టైల్స్ గుజరాత్ నుంచి తెచ్చి విక్రయం చేస్తున్నారు. కడప జిల్లాకు చెందిన బసిరెడ్డి గుజరాత్‌లోనే టైల్స్ కొనుగోలుచేసేవాడు. ఈ క్రమంలో బసిరెడ్డి గుజరాతికి చెంఇన ఓ దుకాణానికి రూ.30లక్షలు మేర భాకీ ఉండడంతో అక్కడికి వెళ్ళకుండా వేరే దుకాణంలో టైల్స్ విక్రయం చేస్తున్నాడు. ఈ విషయం తెలుసుకొన్న గుజరాత్ వ్యాపారులు బసిరెడ్డిని నిలదీసి రూ.30లక్షలు నగదును వసూలుచేశారు. మదనపల్లెకు చెదిన శ్రావన్‌కుమార్‌పై అనుమానం వచ్చి అతనిని బెదిరించడానికి ఆదివారం సాయంత్రంసమీప బంధువైన సునీల్‌కుమార్‌రెడ్డి, లోకేష్‌నాయుడు, మరో పదిమంది అనుచరులు తీసుకొని వచ్చి శ్రావన్‌కుమార్ దుకాణం వద్దకు వచ్చిన కిడ్నాప్‌కు యత్నించారు. విషయం గమనించిన మరో నిర్వాహకులు నగేష్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో డిఎస్‌పి ఆద్వర్యంలో రంగంలోకి దిగి గంటలోనే కిడ్నాపర్లను అదుపులోకి తీసుకొన్నారు. నగేష్, శ్రావన్‌కుమార్‌ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు కిడ్నాప్‌కారణమైన బసిరెడ్డి,సునీల్‌కుమార్‌రెడ్డి, లోకేష్‌కుమార్‌నాయుడు, వాహనడ్రైవర్ల షేక్ హబీబ్‌బాషా, కదిరుల్ల, నిరనాజ్‌షాహీన, బికేస్‌కుమార్‌లను రిమాండ్‌కు తరలించినట్లు సిఐ మహబూబ్‌బాషా తెలిపారు.

## అభివృద్ధిపథంలో చెంబకూరు



రామసముద్రం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త :

మండలంలోని చెంబకూరు గ్రామ పంచాయితీ అభివృద్ధిపథంలో పయనిస్తొంది.ఈ పంచాయితీలోని చీర్లపల్లె, మచ్చువారిపల్లె గ్రామాలకు సిసిరోడ్లు నిర్మాణంకు సోమవారం ఛైర్మెన్ జీకే చంద్ర, వైసిపి నాయకులు ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాలుగా రోడ్లులేక ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కునేవారని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు విన్నవించగా వెంటనే స్పందించిన ఆయన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి మిథున్‌రెడ్డిల దృష్టికి తీసకెళ్ళి నిధులు మంజూరు చేయించారన్నారు. దీంతో వెంటనే ఈ రోడ్డు పనులకు భూమిపూజ చేయడం జరిగిందన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పెట్టుకొని మంచి కార్యమ్రకాలు చేపడుతున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమణమ్మ, మండల కోఆప్షన్ సభ్యులు షంషీర్‌అలీ, ఎంపిటిసి క్రిష్ణప్ప, ఆర్‌బికే ఛైర్మెన్ క్రిష్ణమూర్తి, సచివాలయ కన్వీనర్ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ జింకల శ్రీనివాసులు, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు రాజేష్, దుగువపల్లె రాజన్న, చంద్ర, చంద్రశేఖర్, శ్రీనివాసులు, క్రిష్ణప్ప, వరప్రసాద్, సుదరం, ఎలకపల్లె, విజయ, శంకర్‌రెడ్డి, దిగువపల్లె శంకర్, జనసేన హరి, గణేష్, ఆంజి పాల్గొన్నారు.

## జై...జై..గణేష్ అంటూ అంబరాన్ని అంటిన చవితి సంబరాలు



రామసముద్రం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త :

మండలంలోని వినాయక చవితి సంబరాలు అంబరాన్ని అంటాయి...చిన్నా, పెద్ద, ముసలి, ముతక, యూత్ అని తేడా లేకుండా సోమవారం పండగ సందర్భంగా ప్రతి ఒక్కరూ వినాయకుని పూజల్లో పాల్గొన్నారు. జై..జై..గణేష్ అంటూ నినాదాలతో పూజలు చేసి మంగళహారతులు ఇచ్చారు. భక్తిశ్రద్దలతో కర్పూర హారతులు అందించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మండలంలోని పలు గ్రామాల్లో వినాయకుని ప్రతిమలను వాడవాడ, గ్రామ గ్రామ, పంచాయితీల్లో వెలిశాయి. ఎక్కడ చూపి వినాయకునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదానాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. రామసముద్రంలోని వినాయకునికి అర్చకులు అనీల్‌స్వామి, రాజేష్ స్వామి, మల్లికార్జునస్వామి, శంకర్‌స్వామి, నాగరాజ స్వాములు ప్రత్యేక పూజలు చేసి భక్తులు స్వామిదర్శనం కల్పించారు. తిరుమల రెడ్డిపల్లెలో చంద్రశేఖర్‌రెడ్డి దంపతులుకు గ్రామస్థులు ఘనంగా స్వాతగం పలికి అభిషేకాలు నిర్వహించారు. ఈ వేడుకలకు ఇతర గ్రామీణ ప్రాంత, పట్టణ ప్రాంత ప్రజలు అధికంగా రావడం విశేషం.

## పట్టపగలే ఇంటిలో చోరీ

రూ.1.30లక్షలు నగదు, 100 గ్రాముల బంగారు అపహరణ



వాల్మీకిపురం, సెప్టెంబరు 19 ప్రభాతవార్తః

పట్టపగలే ఓ ఇంటిలో చోరీ జరిగిన సంఘటన మంగళవారం వాల్మీకిపురం పట్టణంలో ని తిరుపతిరోడ్డు మార్గంలో చోటుచేసుకుంది. వివరాలు పట్టణంలో తిరుపతి మార్గంలోని రాజగోపాల్ పట్టణంలోని తరిగొండ రోడ్డులో ఉన్న నర్సరీలో పనులు చేసుకుంటున్నాడు. ఈనేపథ్యంలో ఇంటిలో ఎవరూలేని సమయంలో దుండగులు పట్టపగలే ఇంటిలో వెనుకవైపు నుంచి చొరబడిఒ ఇంటిలోని బీరువాను పగులకొట్టి అందులో ఉన్న రూ.1.30లక్షల నగదు, 100 గ్రాముల బంగారు నగలను అపహరించుకుపోయినట్లు బాధితుడు రాజగోపాల్ తెలిపారు. దొంగతనం జరిగిన విషయం తెలుసుకున్న బాధితుడు రాజగోపాల్ పోలీసులకు సమాచారం అందించి ఫిర్యాదుచేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉదయం నుంచి డాగ్ స్క్వాడ్‌క్లూస్ టీమ్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు.

## స్కూల్ గేమ్స్‌లో స్వామి వివేకానంద విద్యార్థుల ప్రతిభ

వేంపల్లె, సెప్టెంబరు 19, ప్రభాతవార్త :



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన మండలస్థాయి పోటీల్లో స్వామి వివేకానంద స్కూల్ విద్యార్థులు అన్ని అంశాల్లో మంచి ప్రతిభ కనపరిచి జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. యోగ జూనియర్స్ విభాగంలో సుమాంజలి, హర్షిత, సీనియర్ విభాగంలో మణికంఠారెడ్డి ఎంపికయ్యారన్నారు. త్రోబాల్ సీనియర్ విభాగంలో విష్ణువర్ధన్‌రెడ్డి, పవన్‌కుమార్, జూనియర్స్ విభాగంలో అంజన్‌కుమార్‌రెడ్డి, సోహెల్, డిస్కస్‌త్రోలో లోహిత, గణేష్, గంగాధర్, జావెలింగ్ త్రోలో నరసింహారెడ్డి, మహిత, సాహిత్య, గంగాయామిని, అంజన్‌కుమార్‌రెడ్డిలు ఎంపికయ్యారన్నారు. కబడ్డీ సీనియర్స్‌లో విష్ణువర్ధన్‌రెడ్డి, పవన్‌కుమార్, గణేష్, జూనియర్స్‌లో గంగాధర్, అంజన్‌కుమార్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, బాలికల విభాగంలో సీనియర్స్‌లో మహిత, గంగాభవాణి, జ్వలిత, ఖోఖో సీనియర్ విభాగంలో మహేశ్వర, నందీశ్వర్, నరసింహారెడ్డి, సురేంద్రారెడ్డి, బాబురెడ్డి, జూనియర్ ఖోఖో, అంజన్‌కుమార్‌రెడ్డి, జ్ఞానశేఖర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, హరీశ్వర్‌రెడ్డి, బాలికల ఖోఖో సీనియర్స్‌లో మహిత, పుష్ప, జ్వలిత, రోహిణిలు, జూనియర్స్‌లో సాహిత్య, కావ్యశ్రీ, సుమాంజలిలు ఎంపికయ్యారన్నారు. వాలీబాల్‌లో పవన్‌కుమార్, మంజునాథరెడ్డి, లోకేష్, వెంకటరెడ్డి, జూనియర్స్‌లో హేమంత్‌నాయక్, విజయ్‌నాయక్, తరుణ్‌కుమార్‌రెడ్డి, షాట్‌పుట్ విభాగంలో లలిత, ఓంకార్‌లు ఎంపికయ్యారన్నారు. అథ్లెటిక్స్ విభాగంలో 100మీటర్ల రన్నింగ్‌లో గంగాధర్, ప్రణతి, 200మీటర్లలో సాహిత్య, ఓంకార్, మదన్‌మోహన్‌రెడ్డి, 400మీటర్లలో బాబురెడ్డి, 600మీటర్లలో సాహిత్య, అంజన్‌కుమార్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, 800మీటర్లలో గంగాధర్, 3వేల మీటర్లలో మహేష్‌లు ఎంపికయ్యారు. లాంగ్‌జంప్‌లో సాహిత్య, మధుసూధన్‌రెడ్డి, హైజంప్‌లో నరసింహారెడ్డిలు ఎంపికయ్యారు. ప్రతి విభాగంలో తమదంటూ ఓ స్థానాన్ని సంపాదించడం పట్ల కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులను, పీఈటీ పద్మజను అభినందించారు.

## ఎమ్మెల్యే ఆదేశాలతో మల్లయ్యకొండకు అధికారుల పరుగులు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:



తంబళ్లపల్లెకు సమీపంలోని మల్లయ్యకొండలో రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు పర్యటించి అభివృద్ధికి హామీ ఇచ్చి వెళ్లారు. ఈ విషయమై మంగళవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి యుద్ధ ప్రాతిపదికన మల్లయ్యకొండలో సర్వే నిర్వహించి పర్యాటక రంగానికి కావాల్సిన భూ వివరాలు, వ్యూ పాయింట్, భవన నిర్మాణాల స్థలం, టూరిజం పార్కులు, ఉద్యానవనాలు, నీటి వసతిపై నివేదికలు తయారు చేసి ఎమ్మెల్యేకి అందజేస్తున్నట్లు తెలిపారు. మల్లయ్యకొండ రోప్‌వే, వ్యూ పాయింట్, ఉద్యానవనాలు, భవన సముదాయాలు నిర్మిస్తే కొండ మరో శ్రీశైలం కాగలదని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీఠ

వాల్మీకిపురం, సెప్టెంబరు 19 ప్రభాతవార్తః



నియోజకవర్గంలోని ఆరుమండలాల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల అభివద్దికి పెద్దపీఠ వేస్తామని స్థానిక ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పుల్లేటి చెరువుపల్లె, కుందేల్ల వారిపల్లెలకు వేయనున్న తారు రోడ్డు పనులను ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి భూమి పూజల చేసి రోడ్డు పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాలుగా ఈపల్లెలకు తారు రోడ్డు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతన్న నేపథ్యంలో పుల్లేటి చెరువుపల్లెకు రూ.2.52కోట్లు నిధులు మంజూరు అయ్యాయని, కుందేళ్ల వారిపల్లె రోడ్డుకు రూ.1.55కోట్లు నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాబోవు రోజుల్లోముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల అభివద్ది పై దష్టిసారిస్తామన్నారు.కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఓరుగంటి రమేష్‌శెట్టి, లక్ష్మీనారాయణరెడ్డి, ఆర్‌బీకే ఛైర్మన్ భాస్కర్, ఆనంద్, రాయుడు పాల్గొన్నారు.

## నాగదేవత విగ్రహాలు ప్రతిష్ట

రామసముద్రం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త :



రామసముద్రం మండలలోని మూగవాడి పంచాయితీ గొల్లపల్లెలో నాగదేవత విగ్రహాలు ప్రతిష్ట వైభంగా జరిగింది. మంగళవారం ఈ విగ్రహాలను ప్రతిష్టించిన అనంతరం గ్రామస్థులు మాట్లాడుతూ ఏన్నో ఏళ్ళుగా విగ్రహాలు ప్రతిష్టించాలని అనేకొన్నా ఇప్పటికి ఈ కార్యక్రమాన్ని తలపెట్టి విజయం పొందడం జరిగిందన్నారు. ఈ నాగదేవతలకు గ్రామస్థులు, ప్రజలు, పూజారులు కలపి వేద మంత్రలు, మహామంగళహారతి, అభిషేకాలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న భక్తులకు అన్నదానం నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భారీగా ప్రజలు పాల్గొన్నారు.

## చంద్రబాబునాయుడు అరెస్టు అక్రమం

జనసేన పార్టీచే అంబేద్కర్ విగ్రహానికి వినతి

మదనపల్లె, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త :



మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అరెస్టు అక్రమం అంటూ జనసేన పార్టీ రాయలసీమ కోకన్వీనర్ గంగారపు రాందాస్‌చౌదరి తెలిపారు. మంగళవారం ఆర్టీసి బస్టాండు సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం ప్రజాస్వామ్యంకు వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందన్నారు. చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా నినాదాలు చేశారు.కార్యక్రమంలో జనసేన పార్టీ నాయ కులు జంగాల శివరామ్, గ్రానైట్‌బాబు, జగదీష్, క్రిష్ణ, రెడ్డమ్మ, అర్జున, శేఖర్,లవన్న, మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా జునైద్‌అ క్బరి, హనీనాలు కుమార్, నవాజ్,నారాయణస్వామి, జనార్థన్ పాల్గొన్నారు.

## గజమాలతో సర్పంచ్‌కు సత్కారం

మదనపల్లె, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త :



వినాయక చవితి సందర్భంగా పూజలకు విచ్చేసిన కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి కుటుంబసభ్యులను కురవంక ప్రజలు గజమాలతో సత్కరించారు. సోమవారం రాత్రి ఇండియన్‌పబ్లిక్‌స్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ పూజలకు సర్పంచ్ కుటుంబసభ్యులతో విచ్చేశారు. మేళతాళాలతో ఆయనను ఘనంగా స్వాగతించి జేసిబి సహకారంతో గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన వినాయక విగ్రహానికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మాజీ సర్పంచ్ పుసుపులేటి పార్వతి, నాయకులు కువైట్ మాదవరెడ్డి, బోయపాటి మురళి, బిల్డర్ నారాయణ, పుసుపులేటి శశికుమార్, హరిప్రసాద్, ప్రజలు పాల్గొన్నారు.

## గణనాథుని సేవలో జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

**కడప క్రైం, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**

నగరంలోని ఎన్‌జీవో కాలనీ, రాజీవ్ పార్కు, అక్కాయప ల్లిలోని గణేషుని మండపాలను జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ సోమవారం సాయంత్రం సంద ర్శించి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఆయా మండపాల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీ లించారు. కులమతాలకు అతీతంగా పండగలు జరుపుకోవాలని, మత సామరస్యా నికి ప్రతీక అయిన జిల్లా పేరు ప్రతిష్టలు పెంపొందించాలన్నారు. వినాయక చవితి వేడుకలు గణేష్ నిమజ్జనం కార్యక్రమాలు ప్రశాంతంగా, ఆనందంగా నిర్వహించుకోవాలని జిల్లా ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రజలందరికి సకల శుభాలు కలగాలని, ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో, అభివృద్ధిలో ముందడుగు వేయాలని ఆకాంక్షించారు. జిల్లా ఎస్పీ వెంట కడప డీఎస్పీ ఎండీ షరీఫ్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి, చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి, వన్‌టౌన్ సీఐ నాగరాజు, తాలూకా సీఐ రాజా, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## వాడవాడలా కొలువైన గణనాథుడు

**దువ్వూరు, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని దువ్వూరు, చుట్టుపక్కల గ్రామాల్లో సోమవారం వినాయక చవితి సందర్భంగా ప్రజలు వాడవాడలా వినాయకుని విగ్రహాలను కొలువైనాయి. మండలంలో సుమారు 110 విగ్రహాలను నెలకొల్పినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. కొలువైన వినా యక విగ్రహాలకు ప్రజలు, భక్తులు సోమ, మంగళ, బుధవారాలు పూజలు, మంగళ హారతులు నిర్వహించారు. ఈ సందర్భం గా మండపాల వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. విగ్రహాలను బుధవారం నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు రాకపోవడంతో కేసీలో విగ్రహాల నిమ్మజ్జనానికి అవకాశం లేదు. దువ్వూ రు సమీపంలోని ఆనకట్ట వద్ద, అలాగే చల్లబసాయిపల్లె రిజర్వాయర్, కుందూ నదిలో విగ్రహాలు నిమజ్జనం చేసేందుకు ఆయా గ్రామాల ప్రజలు సిద్ధమవుతు న్నారు. గతంలో కరోనాతో రెండేళ్ల పాటు వినాయక చవితికి దూరంగా ఉన్న ప్రజలు ఈ ఏడాది అత్యంత వైభవంగా వేడుకలు జరుపుకుంటున్నారు.

## రాష్ట్ర విభజన సరిగ్గా జరగలేదనడం విడ్డూరం

**– మోదీ వ్యాఖ్యలు అసందర్భం, అనవసరం**

**వేంపల్లె, సెప్టెంబరు 19, ప్రభాతవార్త :**



రాష్ట్ర విభజనపై పార్లమెంటులో ప్రధాని మోదీ వ్యాఖ్యలు అసందర్భం, అనవసరమని ఏపీసీసీ మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ధ్వజమెత్తారు. ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం రాష్ట్రానికి ఇవ్వాల్సింది ఇవ్వ కుండా, చేయాల్సింది చేయకుండా రాష్ట్ర విభజన సరిగ్గా జరగలేదని మోదీ చెప్పడం హాస్యాస్పదమన్నారు. వేంపల్లెలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బీజేపీ మద్దతుతోనే రాష్ట్ర విభజన జరిగిందని, సరిగ్గా జరగకపోతే అప్పుడు అడ్డుకోవాల్సింది అని తులసిరెడ్డి విరుచుకుపడ్డారు. ఈ 9ఏళ్ల బీజేపీ పాలనలో సరిచేయవచ్చు కదా అంటూ తులసిరెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా రాయలసీమ,ఉత్తరాంధ్రకు బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ, కడప జిల్లాలో స్టీల్‌ప్లాంటు, దుగ్గరాజపట్నం ఓడరేవు, పోలరం, విశాఖ మెట్రో, రైల్వేజోన్, విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, ఐఐటి లాంటి 13 కేంద్రీయ సంస్థల నిర్మాణం, వాటిని మోదీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నా రు. వివిధ కార్పొరేట్ సంస్థలతో పాటు కృష్ణాబోర్డు కార్యాలయం రాష్ట్రానికి రాలేదన్నారు. వీటన్నింటికీ కారణం మోదీ ప్రభుత్వ నిర్లక్ష్యం, ద్రోహం అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాటలతో సరిపెట్టకుండా రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఇవ్వాల్సిన వాటిని ఇవ్వాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

## చంద్రబాబు అరెస్టు అన్యాయం

**గాలివీడు, సెప్టెంబర్ 19(ప్రభాతవార్త):**



టీడీపీ జాతీయ అధ్య క్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ను వైసీపీ ప్రభుత్వం అరెస్టు చేయించడం అన్యాయమని మండల టీడీపీ మహిళా నా యకురాల్లు పేర్కొన్నారు. మంగళవారం టీడీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాయచోటి కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై అన్యాయంగా కేసులు పెట్టడం లోపల వేయించ డం జరుగుతున్నదని, కావున ఈ ప్రభుత్వానికి పోయే కాలం దగ్గరకు వచ్చింద న్నారు. వైసీపీ నాయకులు ఎక్కడ చూసినా దౌర్జన్యాలు, అన్యాయాలు చేస్తున్నార ని ధ్వజమెత్తారు. చంద్రబాబు 14సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉండి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి చంద్రబాబు ఎంతో కృషి చేశారన్నారు. ఆయన చేసిన కృషి ఈ రోజు దేశమంతా మార్మోగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నూలివీడు మాజీ ఎంపీటీసీ పార్వతమ్మ, పూలికుంట మాజీ ఎంపీటీసీ అంజనమ్మ, టీడీపీ మహిళలు సులోచనమ్మ, కళ్యాణి, మమత, సుజాతమ్మ పాల్గొన్నారు.

## జగన్ జైలులో ఉంటే సంబరాలు.. బాబు ఉంటే ఏడుపులా..?

**– వైకాపా జిల్లా ఉపాధ్యక్షుడు శశికాంత్‌రెడ్డి**

**పులివెందుల, సెప్టెంబరు 19, ప్రభాతవార్త :**



తప్పు చేస్తే ఏ వయసులోనై నా, ఎవరైనా జైలుకి వెళ్లాల్సిందే నని, దానిలో ఎవరికీ మినహా యింపు ఉండదని వైకాపా జిల్లా ఉపాధ్యక్షుడు శశికాంత్‌రెడ్డి అన్నా రు. పులివెందుల పట్టణంలోని వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబునాయుడు, అతని కుమారుడు లోకేష్ తప్పు చేసి దొరికిపోయార న్నారు. మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, తెదేపా నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లా డుతూనే ఉన్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధికి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పులివెందుల ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నా రు. అందుకే వారికి ప్రజల్లో అభిమానం ఉందన్నారు. సోనియాగాంధీకి జగన్ ఎదురు తిరిగాడని 16నెలలు జైలులో పెడితే ఆనాడు తెదేపా వారు సంబరాలు జరుపుకున్నారని తెలిపారు. అదే ఈరోజు తప్పు చేసి బాబు జైలుకు వెళ్తే ఏడుస్తు న్నారన్నారు. బాబు అరెస్టుతో వారి మహిళలు రోడ్డు బయటకు వచ్చారని తెదేపా నాయకులు గగ్గోలు పెడుతున్నారని, మరి జగన్ అరెస్టు అయినప్పుడు పిల్లలతో ఇంట్లో ఉన్న ఆడవాళ్లు అంతా ఫుట్‌పాత్ మీదకు రాలేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మీద, సీఎం జగన్ మీద ఏడవకుండా న్యాయం పోరాటం చేసి మా నాయకుడు జగన్ లాగా చంద్రబాబు, లోకేష్‌లు ప్రజల్లోకి వెళ్లి ప్రజల ను ఒప్పించి నిజాయితీని నిరూపించుకోవాలన్నారు.

## రక్తదానం మహా గొప్ప దానం

**లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం నందు ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా 21వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నారని ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డా.ధరణికుమార్, ఎచ్‌డీఎస్ కమిటీ సభ్యులు విజయభాస్క ర్‌లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యవసర స్థితిలో ఉన్న రోగికి రక్తం అందక రోడ్డు ప్రమాద ఘటనల్లో చనిపోయిన వారు ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారని రక్తదాతల సహాయంతో సకాలంలో రక్తం అందించడం మహా గొప్ప దానమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి, విశ్రాంత ఎంఈవో సెల్వరాజ్, వైసీపీ మైనార్టీ సీనియర్ నాయకులు మహ్మద్ రఫీ, సాదుల్లా, వైద్యులు నవాజ్, నిస్సార్ అహ్మద్, జీవన్, భరత్, క్లర్క్ రెడ్డికృష్ణ, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాదయాత్రకు పర్లపాడు నాయకులు సంఘీబావం

**రాజుపాళెం, సెప్టెంబర్19, ప్రభాతవార్త.**



మండల పరిదిలోని పర్లపాడు గ్రామ టిడిపి నాయకులు నల్లదిమ్ము వెంకట శౌరెడ్డి ఆధ్వర్యంలో పలువురు గ్రామనా యకులు ప్రొద్దుటూరు టిడిపి ఇంచార్జ్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి నిర్వహిస్తు న్న తిరుమల పాదయాత్రలో మంగళ వారం తిరుపతిలో ఆయనను కలుసుకొ ని పాదయాత్రకు సంఘీబావం తెలిపి ఆయనతోపాటు కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భీరంరామచంద్రారెడ్డి,,జీరెడ్డి రాజశేఖరరెడ్డి, నీలిపాల సంజీవరాయుడు,కొనిరెడ్డి చిన్నరామిరెడ్డి పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో మరుగుదొడ్లు

**నందలూరు, సెప్టెంబరు 19 ప్రభాతవార్త**

నందలూరు మండలంలోని బస్టాండ్ కూడలిలో ఎప్పటినుంచో ప్రయాణికుల కు ముఖ్యంగా మహిళలకు మరుగుదొడ్లు నిర్మించాలని చాలాసార్లు అధికారులకు వినతులు ఇచ్చినప్పటికీ అది స్థానిక ఎమ్మెల్యే, ఎంపిపి అనుమతితో నేడు ఆచరణ లోకి వచ్చిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. నూతనంగా నిర్మించిన మరుగు దొడ్ల ప్రారంభం కార్యక్రమంలో ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే తనవంతు కృషి చేస్తు న్నారని అన్నారు. మండలాన్ని అభివృద్ధిదిశలో తీసుకొనిపోవడం కోసం అహర్ని శలు శ్రమించిన వ్యక్తి మన ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## మిషన్ లర్నింగ్‌పై పుస్తకావిష్కరించిన చొప్పా గంగిరెడ్డి

**రాజంపేట అర్బన్, సెప్టెంబరు 19 ప్రభాతవార్త**



వేర్వేరు పనుల కోసం మనుషులు విడవిడిగా ప్రో గ్రాం రాసే అవసరం లేకుం డానే కంప్యూటరే స్వయంగా ప్రోగ్రాం చేయడం మిషన్ లర్నింగ్‌తో సాధ్యమవుతుం దని అన్నమాచార్య ఇంజనీ రింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.సుబ్బారావు పేర్కొన్నారు. మంగళవారం అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో సుబ్బారావు రచించిన మిషన్ లర్నింగ్ పుస్తకాన్ని సంస్థ గౌరవ కార్యదర్శి చొప్పా గంగిరెడ్డి ఆవిష్కరించారు. మిషన్ లర్నింగ్ నిపుణుల అవసరం వేగంగా పెరుగుతుందన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థలో రుణాల మంజూరు, ఎగవేతదారులపై ముందస్తు గుర్తింపు, వైద్యరంగంలో వ్యాధి లక్షణాల పరిశీలన, జబ్బు నిర్ధారణ త్వరగా తెలుసుకోవచ్చునన్నారు.కార్యక్రమం లో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ, అధ్యాపకులు,సిబ్బంది పాల్గొన్నారు.

## వాహనంతో సహా 5 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

**పీలేరు, సెప్టెంబరు 19 ప్రభాతవార్తః**



డీఎఫ్ఓ శివకుమార్ ఆదేశాల మేరకు పీలేరు ఎఫ్ఆర్ఓ వెంకటరమ ణ, సిబ్బంది కలిసి కడప చిత్తూరు మార్గంలో వాహనాలను తనిఖీ చే స్తుండగా ఉదయం 6.45 గంటలకు ఓకారు చిత్తూరు మార్గంలో వేగంగా వెళ్లడంతో ఆవాహనాన్ని సిబ్బంది పట్టుకోవడానికి ప్రయత్నించగా వారు మమ్మల్ని చూసి కారు ఆపకుండా వేగంగా వెళ్లారు. తేనె పల్లె టోల్ ప్లాజా వద్ద గల మామిడి తోటలో కారును వదిలి పారాపోయారు. కారును పరిశీలించగా 05 ఎర్రచందనం దుంగలు ఉన్నావి. ఏపీ 26ఎఫ్ 7716 నెంబరు గల వాహనం, 05 ఎర్రచందనం దుంగలు బరువు 144 కేజీలు ఉన్నవి. వాహనంతో సహా రూ.7లక్షలు విలువ ఉంటుందన్నారు. ఈదాడిలో వెంకటరమణ, ఎఫ్ఆర్ఓ, ఎఫ్ఎస్‌పీ మరియు సిబ్బంది ప్రతాప్, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

## రాజంపేటలో వినాయకునికి హారతులు ఇస్తున్న ఎమ్మెల్యే మేడా

**వాడవాడలా వినాయకుని వేడుకలు**

**రాజంపేట అర్బన్, సెప్టెంబరు 19 ప్రభాతవార్త**

ఘనములకు అధిపతి విఘ్నేశ్వరుని పండుగ అంగరంగ వైభవంగా జరిగిం ది. పల్లె పట్టణం తేడా లేకుండా వినాయకుని విగ్రహాలను పెద్దఎత్తున ఏర్పాటు చేశారు. కరోనా తర్వాత పెద్దఎత్తున ఈ యేడాది గణేష్ ఉత్సవాలు అంగరంగం వైభవంగా జరిగాయి. గణేష్ మండపాలతో ఆయా ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జడ్‌పి ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిలు పలు వినాయకుని మండపాలలో జరిగిన పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## చంద్రబాబు బెయిల్ కోసం దర్గాలో రమేష్ కుమార్ రెడ్డి ప్రార్థన

**రాయచోటి,సప్టంబర్19,ప్రభాత వార్త:**



రా ష్ట్ర మాజీ ముఖ్యమం త్రి నారా చంద్రబాబు నాయు డుపై అక్రమంగా పెట్టిన కేసు ల్లో వెంటనే బెయిల్ మం జూరు కావాలని రాయచోటి పట్టణం పాత రాయచోటిలోని పవిత్రమైన జమాలుల్లా దర్గా లో ముస్లిం సోదరులతో కలిసి రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమమంలో మిస్లిం మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

## వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండేలా కరుణించయ్యా

**– గణపయ్యకు వేడుకున్న ఎమ్మెల్యే, ఎంపీపీలు**

**లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**



వర్షాలు కురిసి ప్రజలం దరూ సుఖ సంతోషాలతో ఉండేలా కరుణించి కాపాడ య్య వినాయక అంటూ మం గళవారం లక్కిరెడ్డిపల్లె మూ డు రోడ్ల కూడలిలో వెలసిన గణపయ్యకు స్థానిక ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్యతో కలిసి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు గురుస్వా మి, రమణ, టైపిస్ట్ రమణలు ఎమ్మెల్యే, ఎంపీపీలకు స్వాగతం పలికి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాలు బాగా కురవాలని ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ప్రత్యేక పూజలతో దేవున్ని ప్రార్థించడం జరిగిందన్నారు. అనంతరం ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్య, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, ఉప మండలాధ్యక్షుడు సమరసింహారెడ్డి, సుబ్బరాయు డు, సర్పంచ్‌లు వెంకట నారాయణరెడ్డి, రమణయ్య, సిద్ధక నాగిరెడ్డి, వెంకట రమణ, జనార్ధన్‌రెడ్డి, గడ్డం ప్రభాకర్‌రెడ్డి, బాబు, ఎంపీటీసీలు దస్తగిరి, జగన్ మోహన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శంకర్ నాయుడు, నాగేంద్రబాబు, విజయ్, వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయకుని సంబరాలు

**చిట్వేలి, సెప్టెంబరు 19 ప్రభాతవార్త**



వినాయకచవితి పర్వదినం సందర్భంగా సోమవారం చిట్వేలి మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గణనాధుని సంబరాలు ఘనంగా నిర్వహించారు. పార్వతీపుత్రుని వివిధ ఆకారా ల్లో చిన్న, మధ్య, భారీస్థాయి విగ్రహాలను ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలు, పెద్దలు, యువత, మహిళలు పెద్దఎత్తున పాల్గొని వినా యకుని తొలిరోజు పూజలు నిర్వహించారు. పచ్చని పైర్లను, ఆయురారోగ్యాలను, సకల శుభాలను ఇవ్వాలని బొజ్జ గణపయ్యను కోరారు. పలు గ్రామాల్లో తమ సొంత ఖర్చులతో విగ్రహాల ఏర్పాటు, లడ్డూ ప్రసాదాలను కొందరు కుటుంబీకులు ఏర్పాటు చేసి తమ మొక్కులను, భక్తిని చాటుకున్నారు. యువత ఈ కార్యక్రమా ల జయప్రదంలో ప్రత్యేక పాత్ర పోషించింది. ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, పిల్లలు చేసే నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. నిమజ్జనాల కార్యక్రమం కొందరు 3రోజులు, మరికొందరు 5రోజులు, ఇంకొందరు నవరాత్రులు నిర్వహించి తమభక్తి, ప్రవృత్తు లను చాటుకుంటారని, అన్నదాన ఏర్పాటు పెద్దఎత్తున చేపడతారని గ్రామ పెద్దలు తెలిపారు. బాణాసంచా పేల్చే సమయం లో, నిమజ్జనాలు సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని చిన్న పిల్లలను దూరంగా ఉంచాలని పలువురు పెద్దలు, పోలీసులు సూచిస్తున్నారు.

## ముగ్గురు బైక్ దొంగలు అరెస్ట్

**11 బైకులు స్వాధీనం : డిఎస్పీ మహబుబ్ బాషా**

**రాయచోటి, సప్టంబర్ 19,ప్రభాత వార్త:**



ముగ్గురు బైక్ దొంగలను మంగళవారం అరెస్టు సేసి వారి వద్ద నుండి 11 బైకుల ను స్వాధీనం చేసుకున్నట్లు రాయచోటి డియస్‌పి మహ బుబ్ బాషా తెలిపారు. సుం దుపల్లె రోడ్డు ఆంజనేయస్వామి గుడి ముందు అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురిని పోలీసులు విచారించగా వీరు తరచూ టూ వీలర్ దొంగతనాలకు పాల్పడుతూ ఉండే వారని తెలిసిందన్నారు. వీరిలో రామాపురం సూర్యనారా యణరెడ్డి, మాసాపేట షాజహాన్ తిరుపతికి చెందిన అనిల్ కుమార్‌లు అన్నారు. వీరు దొంగలించిన బైకులలో ఎనిమిది రాయల్ ఎన్‌ఫీల్డు, టివియస్ అపాచి, టివియస్ యక్సెల్ ఉన్నట్లు తెలిపారు. వీరు ఈ బైక్‌లను రాయచోటి, తిరుపతి, బెంగుళూరు తదితర ప్రాంతాలలో దొంగలించినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. వీటి విలువ దాదాపు 15లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు. ఈ కేసులో కీలక పాత్ర పోషించిన సిఐ సుధాకర్ రెడ్డిని డియస్‌పి అభినందించారు.

## కులమతాలకతీతంగా వినాయక చవితి పండుగను జరుపుకోవడం హర్షణీయం

**అర్బన్ సిఐ సుధాకర్ రెడ్డి**

**రాయచోటి,సప్టంబర్19,ప్రభాత వార్త:**



మత సామరస్యాన్ని పెంపొ ం దించేలా వినాయక చవితి పండుగ ను జరుపుకోవడం హర్షనీయమని అర్బన్ సిఐ సుధాకర్ రెడ్డి పేర్కొ న్నారు. రాయచోటి పట్టణంలోని రాజుల కాలనీ వెనుక భాగంలో ఇటుకల బట్టీ సమీపంలో ముస్లిం నేతలు షేక్ ఇస్మాయిల్, షేక్ ఖాధర్ లు గణేష్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం సిఐ సుధాకర్ రెడ్డి ఘన నాధుని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వీరికి వరల్డు హ్యూమన్ రైట్ అసోషి యోషన్ ఛైర్మెన్, తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ముస్లిం నేతలు దుశ్శాలవతో సన్మానించి పూల మాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా వినాయక చవితి వేడుకలను జరుపుకోవడం చాలా ఆనందాన్నిచ్చిందన్నారు.నిమజ్జనం వేడుకలలో ఎలాంటి అపసృతులు

## శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారిశాల కమిటీ అధ్యక్షులుగా కేవీ సుబ్బారావు

**బద్వేలు అర్బన్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**



శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిశాల కమిటీ అధ్యక్షులుగా కేవీ సుబ్బారావును మరో 2 సంవత్సరాల పాటు ఆదివారం రాత్రి అమ్మవారిశాలలో పట్టణంలోని పలువురు ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో జరిగిన జనరల్ బాడీ సమావే శంలో తీర్మాణం చేయడం జరిగింది. ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులుగా కేవీ సుబ్బారావు గతంలో 3సంవత్సరాలుగా అధ్యక్షులుగా ఉంటూ పలువురు ఆర్యవై శ్యుల దాతల సహాయ సహకారాలతో అమ్మవారిశాలలో అభివృద్ధి చేయడం జరిగిం ది. అలాగే వారి అభివృద్ధిని గుర్తించి మరో సంవత్సరం పాటు అధ్యక్షులుగా పలు వురు వైశ్యుల ఆమోదం మేరకు వారినే కొనసాగించారు. అయితే వారి పదవీకాలం పూర్తయినందున ఆదివారం అమ్మవారి సన్నిదిలో జరిగిన జనరల్ బాడీ సమావేశా నికి పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, పట్టణంలోని ఆర్యవైశ్య ప్రజలందరూ జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్నారు. గత సంవత్సర రోజుల పాటు అభివృ ద్ధి, జమా ఖర్చుల గురించి కమిటీ వారు వివరించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య వర్తక సంఘం గౌరవాధ్యక్షులు పీవీఎన్ ప్రసాద్, రాచపూడి సాయికృష్ణతో పాటు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు మాట్లాడుతూ కేవీ సుబ్బారావు అధ్యక్షులుగా బాధ్యతలు తీసుకున్న 4 సంవత్సరాల వ్యవధిలో పలువురు ఆర్యవైశ్యుల దాతల సహకారంతో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసి ఆర్యవైశ్యుల మన్న నలు పొందారన్నారు. నిరుపేద వైశ్యులు వ్యాపారాలు చేసుకునేందుకు ఎక్కడ చూసినా అధిక బాడుగలు చెల్లించుకోలేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో పేద వైశ్యుల జీవనోపాధి కోసం శ్రీకన్యకాపరమేశ్వరి షాపింగ్ కాంప్లెక్సులో 24 రూము లు ఏర్పాటు చేసి వ్యాపారుల అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. అలాగే స్మశాన వాటికలో అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేస్తూ కీ.శే.సము ద్రాల పెద్దసుబ్బయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు సముద్రాల రాధాకృష్ణ సహకా రంతో రూ.14లక్షలు విలువ చేసే వైకుంఠ రథం వితరణ చేయడం జరిగిందన్నా రు. అనంతరం శ్రీసత్యనారాయణ ఐరన్ అండ్ హార్డ్‌వేర్స్ దర్శి సుబ్రమణ్యం స త్యా టౌన్‌సిప్ సముద్రాల సుబ్బారావు, దర్శి వెంకటేశ్వర్లు, యాదాళ్ల కృష్ణమూర్తి, సుధాకర్‌రావు, అడ్వకేట్ నాగేంద్రప్రసాద్, సురేంద్రబాబులతో పాటు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు మాట్లాడుతూ కేవీ సుబ్బారావు అమ్మవారిశాల అధ్యక్షులుగా ఉంటూ పట్టణంలో ఆర్యవైశ్యులకు సమస్యలు రాకుండా కృషి చేస్తూ అమ్మవారి శాల అభివృద్ధికి కృషి చేయడం జరిగిందన్నారు. కరోనా సమయంలో కూడా వైశ్యు లకు అండగా ఉంటూ వారికి అవసరమైన కోవిడ్ వ్యాక్సిన్, టెస్ట్‌లు, క్వారంటైన్, అంబులెన్సులు ఏర్పాటు కరోనా నివారణకు ఎంతగానో కృషి చేశారన్నారు. అధ్య క్షులు కేవీ సుబ్బారావు, కమిటీ సభ్యులు చేసిన సేవలు గుర్తించి మరో 2 సంవత్స రాలు అవకాశం ఇవ్వడం సంతోషకరమన్నారు. ఎపేద ఆర్యవైశ్యులకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం అధ్యక్షులు సుబ్బారావును పలువురు కమిటీ సభ్యులు పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో వైవీయూ కౌన్సిల్ మెంబర్ కొండపల్లి చిన్నసుబ్బారావు, కొలిశెట్టి నాగరాజు, శ్రీనివాసులు, శివకుమార్, సత్యనారాయణ, రాధాకృష్ణమూర్తితో పాటు పలువురు ఆర్యవైశ్య సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీసాయి నారాయణ సేవ ట్రస్టుకు రూ.50వేలు విరాళం

**పీలేరు, సెప్టెంబరు 19 ప్రభాతవార్తః**



ప్రముఖ వ్యాపారావే త్త నందలూరి భాస్కర్, శ్రీఫంక్షన్ హాల్ అధినేత వాల్మీకిపురం శ్రీసాయినా రాయణ సేవ (నిత్య అ న్నదాన) ట్రస్టుకు భవన నిర్మాణం కొరకు రూ.50 వేలు ట్రస్టు ఛైర్మన్ ఎ మ్మెల్యే చింతల రామచం ద్రారెడ్డికి విరాళముగా ఇవ్వడం జరిగింది. ఈసందర్భంగా ట్రస్టు ఛైర్మన్ ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరంతరం పేదలకు రోగులకు అభాగ్యులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం కొరకు శాశ్వత భవన నిర్మాణానికి ఈమొత్తాన్ని వాడుతామని తెలియజేశారు. దాతల సహకారంతో గత రెండు సంవత్సరాలుగా అన్నదాన కా ర్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ట్రస్టుసభ్యులు భాస్కర్‌ని అభినందించారు.

## జాతీయస్థాయి క్రీడా పోటీలకు శ్లోకా విద్యార్థుల ఎంపిక

**వేంపల్లె, సెప్టెంబరు 19, ప్రభాతవార్త :**



జమ్మలమడుగులో నిర్వ హించిన రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ క్రీడా పోటీలలో వేంప ల్లెలోని శ్లోకా పాఠశాల విద్యా ర్థులు పాల్గొని అద్భుత ప్రతిభ కనపరిచి ప్రథమ స్థానంలో నిలవడంతో ఎంఈవో వీరా రెడ్డి, కరస్పాండెంట్ నవనీశ్వర్‌రెడ్డిలు అభినందించారు. విద్యార్థులు వెంకటతేజ ,అశ్విని, గంగా ప్రణవి, అఖిల, శాంతి, అభినవ్, వెంకటచరణ్, చరణ్‌లు జాతీ యస్థాయికి ఎంపికయ్యారు. కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థులందరు లక్ష్యసాధన దిశగా ముందుకు వెళ్లాలని తెలిపారు. ప్రిన్సిపల్ రమేష్ మాట్లాడు తూ విద్యార్థులను అన్ని రంగాలలో ముందుకు తీసుకువెళ్లేందుకు తాము ఎల్లప్పు డూ కృషి చేస్తామని తెలిపారు. పీఈటీ నారాయణస్వామి నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, శ్రమ, సాధన ద్వారానే ఈ విజయాన్ని సాధించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సీఎం జగన్ హయాంలో పేద కుటుంబాలకు పథకాల వెల్లువ

**పులివెందుల రూరల్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త :**



సీఎం వైఎస్ జగన్‌మో హన్‌రెడ్డి హయాంలో రా ష్ట్రంలో పేద కుటుంబాలకు పథకాలు వెల్లువలా అందు తున్నాయని పులివెందుల మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ వరప్రసాద్, ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిలు అన్నారు. పులివెందులలోని ఇస్లాంపురం ప్రాంతంలో మంగళ వారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. బలిజ సం ఘం, గుంతబజారు వీధుల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి ఒక్కరి కుటుంబానికి జగనన్న ప్రభుత్వంలో జరిగిన మంచిని వైఎస్ మనోహర్‌రెడ్డి ప్రజలకు తెలియజే శారు. భవిష్యత్తులో జరగబోయే ఎన్నికలలో జగన్‌మోహన్‌రెడ్డికి, అవినాష్‌రెడ్డిల కు మద్దతుగా నిలవాలని తెలిపారు.కార్యక్రమంలో వైకాపా జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శశికాంత్‌రెడ్డి, సివిల్ సప్లైస్ డైరెక్టరు హాల్ గంగాధర్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ హాఫీజ్, ఒతూరు రసూల్, కౌన్సిలర్లు కోడిరమణ, పార్నపల్లె కిషోర్, ఖాదర్‌బా షా, సిద్ధయ్య, మస్తాన్‌వలి, రంగనాయకులు, రవి, కోఆప్షన్ చంద్రమౌళి, యేర్వ వెంకట సుబ్బయ్య, జేసీఎస్ కన్వీనరు చంద్రమౌళి, మున్సిపల్ కమీషనరు నరసింహారెడ్డి, రాజేష్‌నాయుడు, సంపత్, గంగరాజు, గంగిరెడ్డి, ఏఎస్సై చంద్రశేఖర్‌స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీకన్యకాపరమేశ్వరి కాంప్లెక్సులో వినాయక చవితి వేడుకలు

**బద్వేలు అర్బన్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**



మైదుకూరు రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి కాంప్లె క్సులో సత్యనారాయణ ఆధ్వ ర్యంలో షాపింగ్ కాంప్లెక్సు వారితో కలిపి వినాయకుని ఏర్పాటు చేసి ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కేవీ సు బ్బారావు, సత్యటౌన్ షిప్ వ్యవస్థాపకులు ఎస్‌వీ సుబ్బారావు, దర్శి వెంకటేశ్వర్లు, చాటకొండు వెంకట సుబ్బయ్యతో పాటు పలువురు చేతుల మీదుగా వినాయక స్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంప్లెక్సు వ్యాపారులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణదేవరాయనగర్‌లో ఘనంగా వినాయకచవితి వేడుకలు

**బద్వేల్ అర్బన్, సెప్టెంబర్19,ప్రభాత వార్త:**



బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీకృష్ణదేవరాయ నగర్‌లో వినాయక చవితి వే డుకలను కాలనీవాసుల ఆ ధ్వర్యంలో అంగరంగ వైభ వంగా నిర్వహించారు. ప్రత్యే క ఉబయదాతలుగా ఎమ్మా ర్వో ఆవులేటి నాగేశ్వరరావు సతీమణి స్రవంతి ఆవులేటి శేఖర్ రాయల్ సతీమణి రమణమ్మ ఆవులేటి బాబి సతీమణి స్వప్న ఆవులేటి సుబ్బరాయుడు సతీమణి తులసి తులసి శ్రీనివాసులు ధనలక్ష్మి ఆవులేటి చందు తో పాటు పలువురికి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు, ఈ కార్యక్రమంలో పలువురు కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

## వైబిఎన్ పల్లెలో 1.01 లక్షలు పలికిన గణేష్ లడ్డూ

**రాజంపేట అర్బన్, సెప్టెంబరు 19 ప్రభాతవార్త**



రాజంపేట పట్టణం ఎగువ బసినాయుడుగా రిపల్లెలో వినాయకచవితి పండుగ రోజున సోమవారం సాయంత్రం పూజ అనంతరం 15 కిలోల లడ్డూను గ్రామ యువజన సంఘం వేలం పాట నిర్వహించిం ది. ప్రతియేటా వినాయకచవితి రోజునే లడ్డూ వేలం పాట నిర్వహించడం ఇక్కడ ఆనవాయితిగా వస్తోంది. ఈ మేరకు వేలం పాటలో సన్నపనేని బాబునాయుడు విజయమ్మ దంపతులు 15 కిలోల లడ్డూను ప్రసాదం గా అందజేశారు. అనంతరం వేలం పాట 5 వేలతో ప్రారంభమై నాగినేని శ్రీదేవి కుమారుడు వరుణ్‌సాయి 1.01,500 రూపాయలకు వేలం పాడి స్వామివారి ల డ్డూను దక్కించుకున్నారు. ఆలయ నిర్వాహకులు లడ్డూను శ్రీదేవికి అందజేసి స న్మానించారు. వరుణ్‌సాయి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పని చేస్తున్నారు.

## 7వ రోజుకు చేరకున్న రిలే నిరాహార దీక్ష

**పోరుమామిళ్ళ రూరల్, సెప్టెంబర్ 19ప్రభాతవార్త:**

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా వైఎస్సార్ జిల్లా బద్వేల్ పట్టణంలో టీడీపీ బద్వేల్ ఇన్‌ఛార్జ్ విజయమ్మ, యువ నాయకులు రితీష్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్ష 7వ రోజుకు చేరుకుంది. నియోజకవర్గంలోని అన్ని మండ లాల నుంచి టీడీపీ శ్రేణులు రిలే నిరాహార దీక్షకు హాజరై నిరసనను తెలియ జేస్తున్నారు. మంగళవారం పోరుమామిళ్ళ టీడీపీ పార్టీ మండల అధ్యక్షులు భైరవ ప్రసాద్ సారధ్యంలోభారీగా కార్యకర్తలు, నాయకులు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు.